UNIVERSAL LIBRARY
OU_204849
UNIVERSAL LIBRARY

Osmania University Library

Call No T82 R14S

Accession No T2174

Author [illegible]

Title [illegible]

This book should be returned on or before the date last marked below

# FACTS UNPLEASANT.

BY

**T. RAGHAVA** B.A., B.L.,

*Advocate, Bellary.*

PRINTED AT

NARAYAN POWER PRESS, BELLARY

1933

All Rights reserved.] [ Price 1 Re.

శ్రీ రామచంద్ర ప్రసీద.

# సరి పడని సంగతులు

## మొదటి యంకము.

### మొదటి రంగము.

(వకీలు భీమసేనరావుగారియిల్లు. ఉదయము సుమారు 8 ఘంటలు.)

భీమ:— (ఉప్మాతినుచు) తారవిషయమును యోచనచేసితివా?

లీల:— యోచనచేసితిని. వెంట్రుకల తీసియే తీరవలయునా? ఈ క్రూరకర్మ చేయవలసినదేనా? ఈఆచారము మిక్కిలి ఘోర మైనదని మీకు కొంచమైనను మనసుకురాలేదా?

భీమ:— స్వాములవారు ఆజ్ఞాపత్రికకూడ పంపియున్నారే!

(అనుచు మేజాలోని డెస్కునుంచి వెదకి ఒకజాబు పైకితీసి కన్నులకద్దుకొని చదువును)

"మా మఠమందే అభిమానముకలిగి మా అనంతశిష్యకోటికి శేఖరుడైన శ్రీమట్టీకాచార్య సిద్ధాంత ప్రచారకమణిప్రాయు డైన అస్మత్కృపాపాత్రుడగు భీమునకు ఆజ్ఞాపించిన శ్రీముఖ పత్రిక.—

మీఅక్క కుమార్తె, భర్తను పోగొట్టుకొనియు సకేశియై మూడుసంవత్సరములుగా మీయింటనున్నదని ముద్రాధికారుల ద్వారా తెలియవచ్చుచున్నది. ధర్మశాస్త్రప్రకారము నీవింకను ఆబిడకు కేశఖండనము చేయకున్నావు. ఇట్టి దోషమువలన నీకు నీభార్యకు రౌరవాదినరక ప్రాప్తియగుటయేగాక జగద్వంద్య మైన సిద్ధాంతమునకే లోపముకలుగును. అదియునుగాక, నీవా పిల్లకు కేశఖండనము చేయించువఱకును, అస్మత్పాదకమల

రజము నీయింటి నలంకరింపజేయదని తెలియుము. గురువునాజ్ఞ నుల్లంఘించుటకంటె గురుతరపాపము లేదని నమ్ముము-

ఇ తి నా రా య ణ స్మృ తిః."

అనిఇట్లు వ్రాసినారుగదా! నేను చేయునదేమి? ఆచార్య ద్రోహము చేయవచ్చునా? రేపుప్రొద్దున బహిష్కారమువేసినచో నాతండ్రిగారి శ్రాద్ధము నెట్లుచేతును? మఠము వారలెవరు మనయింటికి వత్తురు?

లీల:— కొన్ని ధర్మశాస్త్రములలో అట్లుచేయ నక్కరలేదు, విధవలు మరల పెండ్లిచేసికొన వచ్చుననియు చెప్పినారుగదా? ఇదిగాక, మీగుమాస్తా శ్రీధరుడుగూడ బ్రాహ్మణుడేకదా! చూడండీ! ఆయన, తనతల్లి విధవయైనను వెంట్రుకలు తీయించకుండ ఎన్నిదినములనుంచి పెట్టినాడో! వారింటికి బ్రాహ్మణులు పోవుచునేయున్నారే?

భీమ:— శ్రీధరుడా! వాడు స్మార్తుడు. ఈపిల్ల ఇట్లుండుటంబట్టియే మనఇంటికిరాను విద్యాలంకారాచార్యులుకూడ సంకోచించుచుండగా, ఎంతోడబ్బు ఎక్కువగానిచ్చి సరిచేసికొంటిని.

లీల:— అయితే స్వాములవారికిగూడ డబ్బు ఎక్కువగానిచ్చి సరిచేసికొనరాదా?

భీమ:— అది సాధ్యముకాదు. బహిరంగముగా అనాచారము జరుగుట స్వాములవారు ఒప్పరు.

లీల:— పోనిండు. ఆపిల్లను ఎక్కడికైనను పంపివేయుదము.

భీమ:— అది యెట్లుసాధ్యము? నాఅక్క బావగార్లు గతించినప్పుడు ఈపిల్లను నాచేతబెట్టి, నీవే దానికి తల్లితండ్రి యనిచెప్పి చేతిలో చెయ్యి వేయించుకొని నారే? దాని సుఖదుఃఖములు నేను చూచుకొనకపోయిన మరెవరు చూచెదరు? నేనే దానికి పెండ్లి చేసినది. ఇప్పుడును నేనే దానిని సంరక్షణ చేయవలెను.

లీల:— ఆ! పెండ్లిచేసితిరి! అరువదియేండ్ల ముదుసలివానికిచ్చి. నేనప్పుడే వలదు, వలదు, అని అంటిని.

భీమ:— లీలా! "గతస్యశోచనా నాస్తి". సుఖదుఃఖములు కావడి కుండలు. ఆపిల్లకర్మ, బ్రహ్మఘటన. మనము చేయునదేమి?

లీల:— ఈమాటలువినుటకు నాచేతగాదు. మీరేమైననుచేయుడు. (అని నిష్క్రమించును.)

(భీమసేనరావు లీల వెళ్ళినతరువాత లేచి, యిటు నటు చూచి, లోనికి తొంగిచూచి, ఎవరినో రమ్మని సైగజేయును.)

## తార ప్రవేశము.

భీమ:— ఆవిషయ మేమైన యోచనచేసితివా? లేదా?

తార:— నేనేమి యోచన చేయవలయును?

భీమ:— ఏమి యోచనచేయవలయునా? నామాట వినకపోయిన నీకు కలుగబోవు అవమానమును గురించి.

తార:— నాకొక్కటియు తోచదు. నీవుతప్ప నాకెవ్వరు దిక్కు? నాకేమి యోచనచేయుటకు తెలియును. ఏడ్చుటకుమాత్రము వచ్చును.

భీమ:— తిక్కపిల్లా! ప్రపంచములో విధవలు లేరా? వారికిట్టి కష్టములు రావా?

తార:— ప్రపంచము సంగతి నాకేమి తెలియును? నీవేనాకు సర్వ ప్రపంచము.

భీమ:—అందుకే నేచెప్పినట్లు వినవలెను. చూడు! నీసమాచారము, గుట్టు, లోకులకు తెలిసినయెడల ఎవ్వరు నిన్ను దగ్గరకు రానివ్వరు. నీవు దిక్కులేక కష్టపడవలసివచ్చును.

తార:— నీవుకూడ దగ్గరకు రానియ్యవా?

భీమ:— వెఱ్ఱిదానా! అది నాకు మాత్రము సాధ్యమా? ఇప్పుడు నీకు వెంట్రుకలు తీయలేదనియే స్వాములవారు నాయింటికి రాకయున్నారు. దానిపై నీవు 'ఇట్లు' న్నావని తెలిసినయెడల చెప్పవలసిన యవసరమే లేదు.

తార:—అయితే నన్నేమి చేయుమనిమెదవు?

భీమ:—నేను మరల మరల చెప్పవలయునా? నీవు తప్పక ఔషధము తీసికొనవలయును.

తార:—(బదులు చెప్పక దుఃఖించుచు నిలుచును.)

భీమ:—ఎందుకు నీవేడ్చెదవు? ప్రపంచమునందిట్టి వెన్నియో జరుగుచున్నవి. ఇట్టి విషయములన్నియు రహస్యముగా సవరణచేసికొనకపోయిన, ఈకాలములో ఆచారము బ్రాహ్మణ్యము నెట్లు కాపాడవలయును? ఏడ్వకుము. మందు తెప్పింతునా?

తార:—అయ్యో? నావలనగాదు. నన్ను ఎచ్చటికైనను పంపివేయరాదా? ఏదైన నొక మిషనాస్పత్రికి బంపివేయుము.

భీమ:—అయ్యయ్యో? మిషనాస్పత్రియా? అక్కడ మాంసాహారము, మద్యపానము చేయు, జాతిలేనివారలతో కలసి యుందువా? నీకు పుట్టిన శిశువు ఎక్కడ పెరుగవలయును?

తార:—ఆమిషనువారే రక్షింతురు.

భీమ:—(కొంచెముసేపాలోచించి) ఇది ఎన్నటికినిగాదు. అట్లు చేసినయెడల ఈరహస్యము ఎప్పుడైనను బయలుపడగలదు. అప్పుడునాపేరు నాశనమగును. నేచెప్పినపని నీవుచేసి తీరవలయును.

తార:—అయ్యో! నీవు ఆచారపరుడవే! ఇది పాపముగాదా?

భీమ:— పాపము! బయటపడిన పాపము! రహస్యముగానుండిన ఏమి పాపము? ఎవ్వరుచేయని పనిచేసిన పాపము ఏదో, ఎక్కడనో, ఎవరికిని తెలియకుండ ఇట్టికార్యముచేసిన అది పాపమెట్లగును? ఇట్టిది బహిరంగమైన ఆచారభంగమగును. సమాజము చెడిపోవును. మనోదుఃఖము కలుగును. అందువలన పాపము కలుగును.

తార:— అదియేల? భర్తచచ్చినవెంటనే, ఆడుదానికి దాని సహజమైన ప్రకృతికూడ చనిపోవునా? విధవల పుత్రులు మనుష్యులుకారా? ఇదివరకు ఇట్టివారలు గొప్పగొప్ప కార్యములు చేయలేదా?

భీమ:— అందులకే ఆడవారికి బుద్ధిలేదనుట. మనబ్రాహ్మణ్యము ప్రకృతకాలములో కేవలము సంప్రదాయముపైననే ఆధార పడియున్నది. కాని అట్టి సంప్రదాయములలోను, గుప్తసంప్రదాయములుకొన్ని, బహిరంగ సంప్రదాయములుకొన్నియు కలవు. సంసారముగుట్టు.......అని పెద్దలన్నారు. కావున సంసారము దానికి సంబంధమైన సకల విషయములు గుప్త సంప్రదాయములలో చేరినవి.

తార:— ఇదయంతయు నాకుఅర్థమేకాదు. ఇప్పుడే నామనస్సునకు నరకము ప్రాప్తించినట్లున్నది. దీనికి చేరికగా నీవుచెప్పినపని చేసిన యెడల అంతకంటె హెచ్చుసంకటములు కలుగును. ఏవిధముగా నాలోచించినను ఈకార్యము హత్య అనియే తోచుచున్నది. స్త్రీలమనస్సు తమకడుపులోని ప్రేగులను వెలికితీయుటకైనను ఒప్పును గాని తమచేతులార తమలోని ప్రాణమునే...

భీమ:— [నివారించి] ప్రాణము! పారవేయుట! ఎక్కడనున్నది? నాకంటెను నీకెక్కువగా తెలియునా? దానికి ప్రాణమెక్కడనున్నది?

తార:— ప్రాణము నాకున్నది. నాప్రాణము దానియందున్నది. అది ప్రతినిమిషము తల్లికి అనుభవమగుచుండు మాటగాని మగవారికి అర్థముగాదు. దానిజీవనాడి వైద్యులచేతికి అందకపోయినను తల్లుల హృదయమునకు చెందియుండును. మగవారికంటికి దర్శనమియ్యకున్నను స్త్రీల ప్రేమకు స్పర్శనమిచ్చుచుండును. అట్టి ప్రాణమును భంగపరచుట పాపమే!

భీమ:— ఓసి అవివేకీ! నీకు పిచ్చిపట్టినది. కేశఖండనము లేకనే తల చెడినది. పాపము! పాపము! నీకంతయు తెలుసును కాబోలును. ప్రపంచములో పురుషోత్తముడగు వాసుదేవుడు బ్రాహ్మణ్యమును పుట్టించిన దెందుకనగ బ్రాహ్మణులు సకల ప్రపంచమునకు ఆదర్శప్రాయులై ప్రపంచములో ఆనందము సౌఖ్యము చేయవలయునని. అట్టి బ్రాహ్మణులే ఇట్టిపనులను బయలుపె

ట్టినయెడల, సమాజము చెడిపోయి, దైవసంకల్పమునకు వ్యతిరేకముగా వర్తించినట్లగు. అదియే పాపము. దైవద్రోహామే పాపము. ఈరహస్యము బయలుపెట్టినయెడల దైవద్రోహము చేసినట్లగును.

తార:— అయితే యిట్టికార్యములను బ్రాహ్మణులేల చేయవలెను?

భీమ:— చాలు. ఉపన్యాసము చాలు. నలుగురిలో నీమానము సంగతి విచారింపకపోతివే?

తార:— నలుగురిలో నాకగు నవమానమును తప్పించుకొనుటకై నేను ప్రకృతి దేవతకు అవమానము చేయువలయునా?

భీమ:— ప్రకృతి! ప్రకృతి!! భర్త గతించిన పిదప నీకు వికృతికాక ప్రకృతి ఎక్కడ? నామాట నీవు వినకపోయిన నేనేమి చేయుదునో చూచెదవుగాక.

తార:— ఏమిచేయుదువు? బాధపెట్టుదువు. ఒకవేళ, తుదకు ప్రాణమునే తీసివేయుదువేమో! నాప్రాణమును నేనే చంపుకొనుటకంటె వేరొకరు చంపుట మేలుగదా!

భీమ:— నోరుమూయుము. పిశాచి. నాయట్టివాని కీర్తిని, మంచిపేరును చెడగొట్టి కులనాశనము చేయుటకు ప్రయత్నపడుచున్నావే. నేనేమిచేయుదునో చూడుము.

తార:— (ఏడ్చుచు వెడలిపోవును.)

ప్రవేశము—విద్యాలంకారాచార్యులు.

విద్యా:— ఏమి విశేషము తారాబాయి ఏడ్చుచు పోవుచున్నదే? మీయాస్థానములో ఆమెకేమి తక్కువ?

భీమ:— కలియుగధర్మము. మంచిది చేయప్రయత్నించిన చెడ్డ వెంటనేవచ్చును.

విద్యా:— సరియే, అది నిజము. ఇప్పుడేమైనది?

భీమ:— ఏమియులేదు. చూడుడు ఆచార్యులవారూ! ఏదోభర్తను పోగొట్టుకొని, తల్లిదండ్రులులేని దుఃఖభాజనమైన జన్మము, అని నేనెంతో విశ్వాసముంచి, ఆపిల్లకు సర్వవిధములైన సౌకర్యములు తక్కువలేక కలుగజేయుచువచ్చితిని. ఏదియోకొంచెము హెచ్చు తక్కువలైనప్పుడు.....................

విద్యా:— రాయలవారూ! దీనివిషయమై యోచింపవలసిన పనియేలేదు. ప్రపంచము ద్వంద్వమయము. సుఖదుఃఖములు కావడి కుండలు. మీకు తెలియదా!

"సమదుఃఖసుఖంధీరం, సోమృతత్వాయకల్పతే"

శ్రీమద్భగవద్గీతా వాక్యమిది. జ్ఞానముండవలెనయ్యా జ్ఞానము!

భీమ:— ఆచార్యులవారూ! మీరు చెప్పునది మిక్కిలి యోగ్యమైనమాట. అయిన నామాటలు మీకు పూర్తిగ అర్థమైనట్లు లేదు. విశేషమేమియు లేదు ఒక్కరహస్యము మీతో చెప్పవలయును. మీరు వేదమూర్తులు. కేవలము మాబోటివారిని తరింపచేయుటకు అధికారము కలవారు. తార కించిత్తు త్రోవ తప్పి—చిన్నపిల్ల చూడండి! ఏమోపాపము......ఇదేకష్టము-.

విద్యా:— దీనిక చింతయేల? ఇది ప్రకృతినియమము. ప్రపంచము జరుగవలెను. వృద్ధిగాంచవలయును. ఇది కేవలము ప్రకృతిధర్మము. మనమేమి కర్తలా? కారకులా? అంతయును ప్రకృతియే! ఆట ఆడించుచున్నది.

భీమ:— మీరుచెప్పునది సరియే, అయితే, వివాహమును కట్టుబాటును మన ధర్మశాస్త్రములు చేసియున్నవిగదా?

విద్యా:— ఉండవలె! ఆకట్టుబాట్లు అవశ్యకమే. అయితే ఎవరికి ఆకట్టుబాట్లు? మనకా? బ్రాహ్మణులకా? సంస్కృతము జదివి, శాస్త్రసంబంధ విషయములను కంఠస్థముగా నుంచుకొనిన మనకా ఆకట్టుబాట్లు? ఆకట్టుబాట్లన్నియు-నేనొక గొప్ప రహస్యముచెప్పెదను వినుడు-జ్ఞానము లేనివారలకే. ఈప్రపంచము చంచలము. దీనికిచలనముకద్దు. మార్పుకద్దు. సంచారముకద్దు.

ముందుకు సాగడముకద్దు. అట్టి యీ ప్రపంచనాటకములో, ఇచ్ఛానుసారముగా ఎగురుటకు బ్రాహ్మణుల కొక్కరికి మాత్రము అధికారముకద్దు. దానిలోగూడ శాస్త్రము, అందు లోని పరమార్థము తెలిసిన మాబోటివారలకు మాచే ఉపదేశింపబడు మీబోటివారికిని ఎక్కువ అధికారము.

భీమ:— ఏమో లేనిపోని సందేహములు నన్ను బాధించుచున్నవండీ.

విద్యా:— చూడండీ! సందేహమే సర్వ నాశకము. వేద, శాస్త్ర, పురాణేతిహాసములను ఈసందేహములు తొలగించుటకే మన పెద్దలు వ్రాసిపెట్టినది. బ్రాహ్మణులకు బ్రాహ్మణ్యమే ముఖ్యముగాని శాస్త్రనిబంధనలు లేవు. ఆచార్యులకు అధికారములు కలవు. చేయుటకు శాస్త్రములు కలవు. విడిచిపెట్టుటకు శాస్త్రములుకలవు. ఇదియే ఇప్పటిబ్రాహ్మణాచార్యుల యధికారము.

భీమ:— చూడండీ! ఇంద్రియముల బలము ఎంత ప్రమాదముకలుగ జేయునో. ఇంద్రియనిగ్రహ మెంతకష్టమో?

విద్యా:— మీకు మనధర్మములలోని లౌకికరహస్యముల పరిచయమింకనులేదు. ఇంద్రియ నిగ్రహము చేయవలయునని వ్రాసియున్నారుగాని అయితే దృష్టాంతముల చెప్పెదవినుడు. శ్రీకృష్ణుడవతార పురుషుడవును గదా!

భీమ:— ఆహా! సందేహమేమి!

విద్యా:— ఆ! గమనించండి! శ్రీకృష్ణపరమాత్మ రుక్మిణీదేవిని-మొగట ఉడాయించు, పిదప వివాహము ఎక్కడవచ్చెనయ్యా కట్టుబొట్లు?

భీమ:— అవును. (అని ఇంచుక తలయూచును.)

విద్యా:— ఇంకొక్కటి చూడండీ! అర్జునుడు శ్రీకృష్ణపరమాత్మకు కేవల ముఖ్యశిష్యుడు, అర్జునుడు లేకపోయినయెడల శ్రీమద్భగవద్గీతయే వెలువడియుండదు. "అర్జునఉవాచ" లేకయుండిన "శ్రీభగవానువాచ" ఎక్కడనుండి వచ్చును? అవునుగదా! అట్టి యర్జునుడేమిచేసెను? సుభద్రను-మొదట ఉడాయించు పిదప వివాహము. ఎక్కడ పోయినవయ్యా మీకట్టుబొట్లు?

భీమ:— మనస్సునకిది తోచకపోయినది. చూచితిరా!

విద్యా:— భీమసేనరావుగారూ! శాస్త్రిముల చదువుటయందు ఏమియు లాభములేదు. శాస్త్రిములలోని విశేషార్థముల దెలియుట కష్టము. అందుకే మాబోంట్లనుండియే శాస్త్రమును వినవలెను. మేము చెప్పునదియే శాస్త్రిము. జ్ఞానము కావలెనయ్యా జ్ఞానము.

భీమ:— (యోచనచేయుచుండును.)

విద్యా:— అదేమో "ఇంద్రియములు" "నిగ్రహము" అని చెప్పితిరిగదా? వినండి మరల గీతా వాక్యము-

"నహి ప్రపశ్యామి మమాపనుద్యాత్
యచ్ఛోక ముచ్ఛోషణ మింద్రియాణాం"

స్వర్గసామ్రాజ్యము లభించినను ఇంద్రియ నిగ్రహము కష్టము. 'ఇనుపకచ్చడాల్ గట్టికొన్నముని ముచ్చులెల్ల తామరసనేత్రిలిండ్లబందాలుగారా!' మనకు స్వర్గమెక్కడ రావలెనండీ? శ్రీకృష్ణపరమాత్మయొక్క సహవాసము మెక్కడ కలుగవలెను? ఏదో సర్వసాధారణముగ ప్రవర్తించుచు, ఆస్వర్గ సౌఖ్యములు-ఊ-ఇక్కడనే అనుభవించుచు, పడుచు లేచుచు, పోవలెను. శ్రీమన్నారాయణుని లీలా ప్రపంచమిది. కేవలములీల. మీకు చింతయేల?

భీమ:— (చాలదీర్ఘముగ నాలోచించి) ఇది హత్యయని యనిపించుకొనునేమోగదా?

విద్యా:— రావుజీ! అది యధికారములేనివారికి. గీతా పారాయణము చేయువారికి, హత్య, పాపము అను సందేహమెందులకు? అర్జునునకు ఇదియేకదా సంశయ ముండినది. హత్య పాపముగదా యని కృష్ణుని అడుగగా, పరమాత్మ యేమిచెప్పెను? "కొట్టు, దానివలన కలిగిన ఫలమంతయు నానెత్తిమీద పెట్టు. నీవు కొట్టేకొట్టు, కొట్టకపోతే ఒట్టు. తత్కురుష్వమదర్పణం ఇదియేకదా గీతాసారము. జ్ఞానము కావలెనయ్యా! జ్ఞానము!

భీమ:— అట్లన్న పాపము పుణ్యము అని ప్రపంచములో ఉన్నవా లేవా?

విద్యా:— ఉన్నవండీ! ఉన్నవి. అయితే శాస్త్రరహస్యము తెలిసిన మాబోటి ఆచార్యులవారికిగాదది. ఆభేదము శాస్త్రాధికారము లేనివారికే. మాబోటివారికి, జ్ఞానులకును ఈభావములు కేవలము చిత్తవృత్తులు. దూరమునుండియే వారి యాటలు చూచుచుందుము. మరల వినండి గీతావాక్యము-

"ప్రకృతేఃక్రియమాణానిగుణైః కర్మాణిసర్వశః,
అహంకారవిమూఢాత్మా కర్తాహమితిమన్యతే."

మంచిదికాని, చెడ్డదికాని, పాపముకాని, పుణ్యముకాని, 'నేను చేస్తాను' అనుకొనుట మాత్రము తప్ప ఇది వట్టియహంకారము.

భీమ:— లోకులు ఏమనుకొందురో, ఆచార్యులవారూ! అదేమియు విచారింపవలదా?

విద్యా:— లోకులు? ఎవరికర్మ వారు అనుభవించుదురు. అయితే ఒక్కటియే ముఖ్యాంశము. లోకులనోట పడకుండ కొంచెము సంప్రదాయము ననుసరించి ఆచరించినసరి. మీకేమి కొఱత? ప్రాతఃకాలముననే లేచెదరు. స్నాన సంధ్యావందనాద్యనుష్ఠానంబుల జరుపుచున్నారు. గోపీచందన ద్వాదశోర్ధ్వపుండ్రముల ధరించుచున్నారు. సదక్షిణ బ్రాహ్మణపూజ చేయుచున్నారు. దేవాలయముల కట్టించడమునకై చందాలు వసూలుచేయుచున్నారు. ఇప్పటి ఈనవీన పద్ధతులు-జాతి మతభేదములు లేవనియు, మాల మాదిగలు మనకు సమమనియు, ఇట్టి వక్రమార్గములలో-ఒక్కటిమైనను లేవు. పైగా అన్నిటికంటె ముఖ్యముగా లోకులకు తెలియునట్లు ఏకాదశీ వ్రతము నాచరించుచున్నారు. చాతుర్మాస్యముపట్టుకున్నారు. కేసులకుగాను చెన్నపట్నానికి పోయినప్పుడంతయును తిరుపతికిపోయివస్తారు. ఇంకేమిగావలయును? లోగుట్టు పెరుమాళ్ళకెఱుక. చూచితిరా! ఏను

గకు తినుటకు దంతములు వేరు, ప్రదర్శనానికి దంతములు వేరు. ప్రదర్శనము బాగుంటె చాలు. ఇదియే ఇప్పటిగొప్ప సంప్రదాయము. ఇదంతయు నాటకమండీ! నాటకము!! జ్ఞానము కావలెనయ్యా! జ్ఞానము!

భీమ:— నేను అదేచెప్పితినండీఆపిల్లకు. రహస్యముగా పోగొట్టుకొంటే మరల యథావిధిగా నుండవచ్చునుగదా!

విద్యా:— అంతేసరి! అదిగాక ఇట్టిపనులుచేసిన-ఇది పాపముగాదనుకొండి. ప్రకృతి! ఒకవేళ ఏదైన అకార్యము జరిగినను మన ఇప్పటి సనాతనధర్మములేదా? పాపశాంతికి పుణ్యస్థలములులేవా? పుణ్యతీర్థములులేవా? కాశి, గయ, ప్రయాగ, పూరి, బదరి, తిరుపతి, రామేశ్వరము, గంగ, యమున, కృష్ణ, గోదావరి, కావేరి, ఓహోహోహో!!! ఇన్ని పుణ్యస్థలములు పుణ్యనదులు, పాపమును చించి చెండాడలేవా? రైలుసాకర్యములులేనప్పుడు ఆపాపములు. ఇప్పుడెక్కడివి? పైగామాబోటి బ్రాహ్మణులులేరా? అయ్యా, గంగానదిని ఆపోశనముగా తీసుకొంటిమండీ? విషమునే తాగిన ఈశ్వరుడు మాబోటివైష్ణవాచార్యులవారికి కేవలము భక్తుడు, అట్టి మేము చేయిపట్టినచో పాపము మందుకైనదొరకునా?

భీమ:— ఔరా! హిందూధర్మము, హిందూఆచారము-ఎంత సారవంతముగానున్నది! ఈబ్రాహ్మణ్యములో ఎంత సాకర్యమైన ఏర్పాట్లు? బ్రాహ్మణులొక్కరు లేకపోయిన ప్రపంచమే మునిగిపోవును. ఇప్పుడు కొంచెము కొంచెము సమాధానమాయెను.

విద్యా:— పోయివత్తునా? సెలవా? ఆలోచన చేయవద్దండి. ఆచార్యుల వారుండువరకు రాయులవారికి చింతయేవద్దు. మీరు చేయుచుపోండు, మేము ఎత్తివేయుచువచ్చెదము. మీబోటి లక్ష్మీపుత్రులను ఏపాపము చేరును? సెలవా?

భీమ:— (నమస్కరించి ఆచార్యులవారిని పంపును. పిదప అటుఇటు రెండుసారులు తిరుగును. ఇంతలో గుమాస్తా శ్రీధరుడు ప్రవే

శించి, రాజా వీరణ్ణశెట్టి ఏదో ఒక కేసుకు వచ్చియున్నాడు అని చెప్పను. భీమసేనరావు తొందరగా షర్టు వేసికొనుచు) ఇక్కడికే రమ్మనుమయ్యా.

(రాజా వీరణ్ణశెట్టి-ప్రవేశము.)

శెట్టి:— దండము. స్వాములవారికి దండము.

భీమ:—దండము. రండీ శెట్టిగారూ! కూర్చొనండి. ఏమివిశేషము?

వీరణ్ణ:— అయ్యగారికి నిండా పనివున్నట్లుందే! అయ్యగారికి ఎప్పుడుపనే! పురుసత్తేలేదు.

భీమ:— వకీళ్లకు పురుసత్తుంటే ఎట్లండీ? మేమంత పూర్వకాలపు వాండ్రు. ఇప్పుడువచ్చే వచ్చే వకీళ్లకు పురుసత్తే ఎక్కువ. దానిలో ఈ మునిసిపల్ ఛేర్మనుపని ఒక్కటి.

శెట్టి:— దాంట్లో ఏమిఫాయిదా లేదండీ! మీరు ఎందుకు ఊరకే కష్టపడుతారో!

భీమ:—శెట్టిగారూ! నాఫాయిదాకొరకా. నేనుఛేర్మనుపనిచేయుట? లోకులకు ఎంత ఉపకారము చూడండీ! ఊరికి కొళాయిలు తెప్పించినాను. మనుష్యులకు, పశువులకు, ఎంత సహాయము చూడండీ!

శెట్టి:— కాదుస్వామీ! మార్కెట్టులో అంటారు--కొళాయిలు తెప్పించినది మీకంటె ముందుండిన ఛేర్మన్‌గారంటనే?

భీమ:— కొళాయిలకొరకు బునాదిలో సర్కారువారితో నేనెంత కొట్లాడినది లోకులకేమి తెలియును? నేను ప్రవేశించకపోతే కలెక్టరు ఒప్పుకొనుచుండెనా? మార్కెట్టుమాట కేమిలెండీ? మనవూరి మార్కెట్టులో వ్యాపారములో మూటలు తక్కువైతే మాటలు ఎక్కువైయుండును. అదిసరిగాని, మీరువచ్చిన పనియేమి?

శెట్టి:— ఏమిలేదు. కొంచెము రికార్డుచూడవలెను. ఆసామినాపైన మునిసిఫ్‌కోర్టులో కంట్రాక్టు దావాచేసినాడు, చిన్నపని.

భీమ:— అయ్యో? పెద్దపనులే నన్నుపూపిరి తిప్పకొనలేనట్లు చేసి నవే! దానిలో చిన్నకోర్టు పనులకెక్కడవచ్చేది? మీరువర్త కులే! చిన్నకోర్టుకు పెద్దఫీజు ఇస్తారా? (కొంచము యోచన చేసి) అదిగాక చూడండీ! ఇప్పుడుండు మునిసిఫ్ నాకుచాలసే హితుడు. ఇంటికిరావడము పోవడముకద్దు. ఒకవేళ న్యాయము మనతట్టేవుండి మనపక్కనే తీర్పుఅయితే మీమార్కెట్టులోని వారు ఊరకేవుంటారా? యోచనచేయండీ?

శెట్టి:— స్వామి! స్వామి!! స్వామి!!! మార్కెట్టులోని మాటల కేమి? ఈనంబరు మీరేచేయవలెను. ఎంతఫీజైన ఇస్తాను.

భీమ:— మునిసిఫ్కును నాకున్న స్నేహమున్నదని మీతోచెప్పినదే కష్టమాయెనే? మీపుణ్యమయ్యేని ఎవరితోను చెప్పవద్దండీ.

శెట్టి:— కద్దాస్వామి! గంగమ్మ కడుపులో గప్-చిప్.

భీమ:— సరేకాని-ఫీజు ఏమిఇస్తారు?

శెట్టి:— కొండంతదేవరుకు కొండంతపత్రి తేవడానికి సాధ్యమా? అదిగాక మదింపు.........

భీమ:— సరే! సరే!! సరే!!! దావామదింపుకు సరిగా ఫీజు తీసుకొ నుటకు నేనేమి అట్లా యిట్లా వకీలనుకొంటిరా? నేనుఅందులకే చిన్నసంబరు పట్టేదిలేదు. నేనుచేసే ధర్మకార్యాలకు, నేనుక ట్టించే దేవాలయాలకు, నేను చిన్నఫీజుతీసుకొంటే ఎట్లుజరుగ వలెను?

శెట్టి:— ఫీజుకేమిలెండిస్వామి! అయితే కేసుజయప్రదముకావాలె, చూడండి.

భీమ:— "యతోధర్మస్తతోజయః" మనదేధర్మము. మనకే జయము.

శెట్టి:— అయితే ఒక్కమాటస్వామి! నాదస్కత్తుతో ఒక్కకా గితము ఎదురుకక్షిదారువద్ద చిక్కినది. ఏమిచేయవలెను అని ఆలోచన చేయుచున్నాను.

భీమ:— దస్కత్తునాదికాదు అంటేసరిపోయెను. దస్కత్తుపరీక్షకు పంపుదురు. కొంచెముమీరు సంచికట్లు విదిలించితే సరిపోతుంది లేకపోతే ఇంకొకరసీదు వాదిదస్కత్తుతో హాజరుచేస్తే మరి బాగు.

శెట్టి:— స్వాములవారు చెప్పేది నాకు మందట్టుకురాలేదు.

భీమ:— అంతావచ్చునులెండి! ఇదిప్రపంచము. కొంచెముకల్పనా శక్తికావలె. లేకపోతే న్యాయమేమునిగిపోతుంది. ముందుఆలోచనచేస్తాము. కాని ప్రస్తుతము రికార్డుయిచ్చిపొండు. అడ్వాన్సు శతమానము—

శెట్టి:—చాలా భారము వేసితిరి.

భీమ:— నీయిష్టము. మీకట్ట తీసుకొనిపొండి. ఎదురుపక్షము వారువచ్చి వకాలతు యిచ్చినారంటే నామీద మాటలేదు సుమండి.

శెట్టి:— స్వామి! స్వామి!! స్వామి!!! ఇదో 50 రూపాయిల నోటు తీసుకొండి. మిగతాది, చిన్నోడు పల్లెకుపోయుండాడు. వచ్చిన తరువాత హాజరుచేసికొంటాను.

భీమ:—మిగతాది వచ్చేవరకు, కట్టనుముట్టను. (అని శెట్టివారిచేత నుంచి కట్టతీసుకొని భీమసేనరావు లేచును. శెట్టి దండముపెట్టి పోవును. భీమసేనరావు నోటుతీసుకొని డెస్కులోపెట్టి బీగము వేయుచూ—

"ఆపదామపహర్తారం దాతారం సర్వసంపదాం,
లోకాభిరామం శ్రీరామం భూయోభూయోనమామ్యహం"

అనిగట్టిగ చదువుచుండగా తెరపడును.)

# సరిపడని సంగతులు

## మొదటియంకము-రెండవరంగము

(మొదటిరంగమునకు ఈరంగమునకు నడుమ రెండు మూడు దినములు గడచినవి. కాలము రాత్రి $9\frac{1}{2}$ ఘంటలు. వెన్నెలవెలుతురు కొంచెము మందముగా నుండును. వీథిలో జనుల సంచారములేదు.

లోపలినుంచి శ్రీఆంధ్రనాటక పితామహుని ప్రమీలా నాటకము యొక్క ఉత్తర రంగములోని-

"ఏరాజ్యంబున దరుణు లు
దారకళాకుశల సుస్వతంత్రలుగలరో
యారాజ్యంబునఁ బురుషులు
ధీరులు నధికారు లమలధీసువిచారుల్"

—అనుపద్యము చదువుచు కాలేజి స్టూడెంట్లు భాస్కరుడు, రాజా, రఘునాథాచారి, మరియు గుమాస్తా శ్రీధరుడు, ప్రవేశింతురు.)

భాస్కర:— ఆహా! ప్రమీలా పార్టుచేసిన కుర్రవాడు ఎంత రసవంతముగ ఆక్టుచేసినాడురా? ఆడుదాని శక్తిముందు మగవానిది ఏమినిక్కుతుంది. అర్జునుడో ప్రమీలా మహారాణిని చూడగానే తరతరలాడి డంగు అయిపోయినాడు రఘునాథా! చూచితివా! ఆడువారిని ఎప్పుడును నేలపెట్టి కాలరాచవలెనని వాదించుచుంటివే, ప్రమీలరాజ్యములో ఏమితక్కువగనుండె? ఒక్క మగ పురుషుడైన లేకనే ఎంతశక్తితో, ఎంత శోభావహముగ ప్రమీలా రాజ్ఞి రాజ్యమేలుచుండె? అందులకే కవి చక్కగా వ్రాసినాడు;.

"ఏరాజ్యంబునఁజెలు లవి
చారలు పరతంత్రలస్తుసత్వాలుగలరో
యారాజ్యము పురుషు లనా
ధారులు నవిచారు లస్వతంత్రవిహారుల్"

రఘూ:— పోరా! పోరా!! నాయభిప్రాయ మేమన-అర్జునుడు దయదలచి ఆడుదానికెందుల కపజయముకలుగవలెనని ఆమెను

మోహించి ఓడినట్లు నటించెనుకాని అర్జునుడేమి? ఓడుటయేమి! ఆగాండీవము నొక్కమాటు టంగుమని మ్రోగించితే ప్రమీల ఏమైపోయియుండునో!

భాస్కర:— బుద్ధిమంతుడంటే నీవేరా! నీయట్టివాడు పుట్టునదే యపురూపము.

రాజ:— భాస్కరా! ఆడువాండ్రు కేవలము ప్రజోత్పాదక యంత్రములు (Child Manufacturing Machines) అనుశాస్త్రము నేర్పరచియుండు మారఘునాథునకు అంతకంటె బుద్ధిఎక్కడ నుంచిరావలెను?

భాస్కర:—రఘూ! నీవు హిందూదేశ చరిత్రను (Indian History) జదివినావుగదా?అహల్యాబాయి, హోల్కరు, ఝాన్సి లక్ష్మి బాయి వీరిచరిత్రలు అసత్యములా? చెప్పెదనువినుము. రఘూ! ఈప్రపంచములో ఈనాటికిని ఆడుది చేయజాలని యసాధ్యకార్యమేలేదు. ఆంగ్లేయకృతకనదిని (English Channel) ఒకగంక్కలో దాటివేసినది. సరియేనా? ఆకసమున వేలకొలది మైళ్ళు ఎగిరిపోయినది! ఇంకొకటి, రఘూ! వేదాధ్యయనముజదివి, 'ఈకాలమందును, సంపూర్ణ సనాతన ధర్మము' నుద్ధరించువారైన బ్రహ్మతేజస్సు, బ్రాహ్మణ ప్రభావము వీనితోనిండిన మీఆచార్యులవారుక్రింద, వేదాధ్యయనమున కధికారమేలేని ఆడుదిపైన విమానములో. ఆడుదానికి విమానము. ఆచార్యులవారికి అవమానము.

రఘూ:—నోరుమూయుమురా. నీవుచెప్పునదంత యూరపుఖండపువార్త. వారియాచారమువేరు. మనయాచారమువేరు. వారిధర్మమువేరె, మనధర్మమువేరె. చూడు! మనశాస్త్రములలో స్త్రీ, శూద్రులను తక్కువ దర్జాలో పెట్టియున్నారు. చూడు, వారికి దర్జాఎక్కువచేస్తే మనకు ధర్మముతక్కువ అయిపోతుంది.

శ్రీధరు:— అయ్యా! రఘునాథాచార్యులవారూ! స్త్రీ శూద్రులంటివే ఏశాస్త్రములో నున్నది? ఈ "జన్మనాజాయతేశూద్రః.

సంస్కారాద్ద్విజఉచ్యతే"! అనునది ఋషిప్రోక్తము కదా! వసిష్ఠులవారు నారదమహా ఋషులు, వాల్మీకి, వ్యాసులు, పరాశరులు, వీరందరు బ్రాహ్మణపుత్రులేనా?

రఘు:— వకీలుగుమాస్తాగారూ! మీకెప్పటికిని వక్రమార్గమే అల వాటు. వాల్మీకి, నారదులు, వ్యాసులు వీరంత మగవారయ్యా ఆడువారలు కారు.

భాస్కర:— వారు మగవారుకనుక గొప్పవారైరని నీయభిప్రా యమా, ఆచార్యులవారూ! ఎంతమందిస్త్రీలు ఉపనిషత్కర్తలో తమకు తెలియునా? స్త్రీలే వేదముల కలంకారప్రాయులై యుండిరి. చెప్పెదను వినుము. జుహూం-గోథ, యమి, శచి, ఆహా! వీరందరు ఆడవారయ్యా! ఋగ్వేదములోని పదియవ మండల మునకు గారణము స్త్రీబుద్ధియే. పాపము! ఈసమాచారము నీకేమి తెలియును. మీగురువులగు శ్రీమాన్ విద్యాలంకారా చార్యులవారికి కుడుముల తినుటకు తెలియును. పొట్టపెంచుటకు తెలియును. ప్రపంచమునకు టోపివేయుటకు తెలియును. వారి పేరు విద్యాలంకారులు. వారికి అలంకారానికే విద్య. నీవన్నో గురువులను మించిన పరమానంద శిష్యుడు. "ఎద్దుమొద్దు స్వ రూపాయ. ఏనుఃపోతాయ మంగళం."

రఘు:—చాలును లెమ్ము. నీసమాచారము తెలిసినదేకదా! వాదిం చడమునకు చేతకాకపోతే తిట్టడము మొదలుపెట్టుట నీకు వాడుకయే.

భాస్క:— ఓరే! పనికిమాలినవాడా! (Stupid) స్త్రీలమహిమను వర్ణించుటకు వాగము వేరుకావలెనా? విను. శక్తిస్వరూపము స్త్రీ. సహన స్వరూపము స్త్రీ. సంసారము స్త్రీనుంచియే. ఆచారవిచారములు స్త్రీనుంచియే. ఈప్రపంచమునకు ఆధా రము స్త్రీరూపమే. అదికాక నీ"తల్లి" స్త్రీయే. మరి స్త్రీలకు పుట్టినవారు బ్రాహ్మణులెట్లగుదురు? అర్థమాయెనా?

రఘు:— ఓ! అర్థమైనది, నీవు అవివేకివని. నీవు ఎంతచెప్పినను స్త్రీ జాతి తక్కువయనియే నాయభిప్రాయము. తక్కువకనుకనే ఏ రహస్యము వారిదగ్గరదక్కదు. ఇరువురుస్త్రీలు కలిసిన కొట్లాటతప్పక ప్రారంభమగును. ఏమ్మతప్ప వారికి వేరుతర్కవాదమే తెలియదు. కాలమంతయు సొగసుచేసికొనుటయందే గడుపుదురు. అదిగాక మన మతములలో దేనియందైనను స్త్రీలు స్వాములవారైనది చూచియున్నావా?

భాస్క:—రఘునాథా! ఎంతటి మూర్ఖుడవు నీవు? ఈదేశమునకు ప్రస్తుతము గలిగియుండు దైన్యదశకు ఇచ్చట స్త్రీలను ఆవరించియుండు అజ్ఞానమే కారణమని నీమనసునకు తోచదే! ఇంటియందు గృహిణిదుఃఖించి రోదించుచున్నదన్న, నాయింట శుభము గలుగునా? ఇట్లుండ దేశములోని స్త్రీలందరు దుర్బలులై పరతంత్రలై, అజ్ఞానులై, సంస్కృతిలేక శుష్కించుచుండగ దేశమునకు వైభవమెట్లుండును? స్త్రీలకు విద్యలేకున్న.........

రాజ:—(అడ్డుపడి) భాస్కరా! మన దేశమునకు వచ్చినందుకు మన దేశమున జరుగుచుండు వివాహములనుండియే, మనవివాహములకు తలిదండ్రులభీతి, నిర్బంధము కారణముకాని, దంపతుల ప్రీతికి అందుచోటేలేదు. అట్టివివాహములనుంచి సరియైనసంతానమెట్లుగలుగును? విద్యలేని, స్వేచ్ఛలేని, బలములేని, సరియైన ఆధర్మములేని, తల్లికి ధైర్యశాలియగు పుత్రుడెట్లు గలుగును? పూర్వము మన క్షత్రియవీరులు తమస్త్రీసమూహములను రక్షించుటకుగదా ప్రాణములయందు ఆశవీడి రణరంగమున పోరాడుచుండిరి! మనమన్ననో ఇప్పటిసమాజములో స్త్రీలమానము కాపాడుటపోనిమ్ము, వారికి అవమానము కలిగింపకున్న చాలును. క్లబ్బుస గతి తెలుసునుగదా! కొంచెము అవకాశము గలిగి, నలుగురుమెంబర్లు ఒక్కచోటచేరినచో, సంభాషణ పర స్త్రీలనుగురించియే! ఈ స్త్రీఇట్లు, ఆ స్త్రీ అట్లు—ఇంత తప్ప వేరె సంగతుల సంభాషణయేలేదు. ఆడవాండ్రు ఎట్టివారేకాని, వారియందు ఎట్టిలోపము గలిగియుండినను, వారినిగౌరవించి

ప్రేమించి దేశోద్ధారక కార్యములలో వారిని సహచరులుగ భావించు మగవాడే నిజమైన మగవాడు. ఆడుదానిని నొప్పించి బాధించు మగవాడు దేశమునకు, దైవమునకును పగవాడే?

రఘు:— Ladies & Gentlemen,

Three Cheers for the mighty Speach.

ఔరా! రాజా!! Women's Champion నీవే!!! అనాధరక్షకుడవునీవే!!!! ఆహాహాహా! స్త్రీలపాలిటి చింతామణి ప్రాయుడవు నీవేనయ్యా!

భాస్క:— రఘునాథా! ఇది నీతప్పుగాదు. ఇప్పటిసమాజపు తప్పు. మనసమాజమును నిర్బంధమునపెట్టి ముందు సంకెలలు, మన ము మన స్త్రీలకు తొడగిన ఆసంకెలలే......

రఘు:— భాస్కరా! ఇంకచాలు నీయుపన్యాసము. మాయింట మంగళ హారతికి వేళఅయినది, పోవుదము.

(రాజ యింటిలోనికి పోవుచుండగా, తార లోనుండివచ్చును. భాస్కరుడు, రఘునాథుడు వెడలిపోవుదురు. శ్రీధరుడు మరగున నిలుచును)

తార:— రాజా! ఒక్కమాట.

రాజ:— ఏమి యిట్లువచ్చితివి!?

తార:— రాజా! ఒక ప్రమాదము సంభవించినది. "స్త్రీలకు ఎట్టి విపత్తులు వచ్చినను సహాయము చేయవలసినది పురుషుల ధర్మ"మని నీవు ఎల్లప్పుడు ఉపన్యాసములిచ్చుచుంటివిగదా! నీ పరీక్ష సమీపమునకువచ్చినది.

రాజ:— అవును చెప్పుచుంటిని. ఆడుదానిని నొప్పించుమగవాడు మగవాడే కాడని ఇప్పుడుకూడ చెప్పితిని. అయిన నీమాటలు నాకు అర్థముగాలేదు. నాపరీక్ష సమయమేమి?

తార:— రాజా!...... నాయందు నీకు నిజమైన ప్రేమయున్నది గదా?

రాజ:— (ఇటునటుచూచి, శ్రీధరుని కానక, తారను సమీపించి) తారా! నన్నడగవలెనా? నీకొరకై నాప్రాణముల నర్పించుటకైనను సంసిద్ధుడనైయున్నానే!

తార:— రాజా! నీవు నన్ను పెండ్లియాడుటకు సిద్ధుడవైయుంటివిగదా!

రాజ:— ఏమి ఇప్పుడే పెండ్లియాడ వలయునని నెదవా?......అవశ్యము చేసికొందును. విధవావివాహము సంస్కరణమునకు మొదటిమెట్టు. అదియుగాక నీవు విధవయేకాదని నాయభిప్రాయము. తొలుతనుండి మనము ఒకరికొకరు ప్రేమించియుంటిమి. హృదయపూర్వకమైన ప్రేమతో మగడేర్పడును గాని మంత్రములతో మగడుకాగలడా? ఇప్పుడు వివాహమునకేమి తొందర? నేను ఈతూరి ఖండితముగా B. A., పరీక్షయందు కృతార్థతనొందుదును. పిదపతప్పక నాకు సర్కారునౌకరీ అబ్బును. నౌకరీలో చేరినవెంటనే నిన్ను పెండ్లి చేసికొందును. అప్పుడు తండ్రి భయములేదు, గింద్రి భయములేదు.

తార:— రాజా! నేను గర్భిణిని.

రాజ:— (నిర్విణ్ణుడై దూరముగా నిలుచును.)

తార:— రాజా! భయపడకుము. నాచేయి విడువవలదు.

రాజ:— నిజమా?

తార:— అవును.

రాజ:— ఎంతప్రమాదము గలిగెను! దీని కుపాయమెద్ది?

తార.— ఇదిప్రమాద మనుకుంటివా?

రాజ:— తారా! కనలుకుము. ఇట్టిది సంభవించుట ప్రస్తుతము అననుకూలమే కదా!

తార:— మీతండ్రికి తెలిసినది.

రాజ:— ఏమనెను?

తార:— చెప్పరానిమాట చెప్పెను.

రాజ:__...............

తార:__ నీకు సమ్మతమేనా?

రాజ:__ తారా! తారా!! నేనంతటి క్రూరకర్ముడనా?

తార:__ క్షమింపుము. మీతండ్రి నన్ను బెదరించుచున్నాడు.

రాజ:__ ఎంతప్రమాదము!! ఇప్పుడేమి చేయవలయును?

తార:__ ఏమిచేయవలయునా, ధైర్యము వహించవలెను.

రాజ:__ వహించి?

తార:__ నన్ను బహిరంగముగ వివాహమాడవలెను.

రాజ:__ తారా! తారా!! ఇది నాచేతకాదు.

తార:__ ఇదియేనా నీప్రేమ!!

రాజ:__ ఎంతకష్టము!

తార:__ రాజా! నిక్కంపు ప్రేమకష్టములను లెక్కించునా? అగాధమైన, అపారమైన, హృదయపారావారమునుంచి వెడలుప్రేమ ప్రవాహమును నిరోధింపజాలు కష్టములెందైన గలవా? ఇపుడు నన్ను భరించినగదా నీవు నాకు నిక్కంపు ప్రియుడవు కాగలవు!

రాజ:—...............

తార:__ రాజా! మాటాడవేమి?

రాజ:__ నాకేమియు తోచకున్నది.

తార:__ రాజా! నీవు నన్ను భరింపలేకున్న నాకగు నవమానము యోచించితివా? ఇది నీకిష్టమేకదా!

రాజ:__ ఒకవేళ ఎచ్చటికైనను పోయిన.........?

తార:— ఎచ్చటికి పొమ్మందువు?

రాజ:__ నాకేమియు తోచదు.

తార:__ రాజా! నేనే, మీతండ్రిగారితో "నీవే" నాభర్తయని చెప్పెదను.

రాజ:— తారా! తారా!! వలదు, వలదు, నీవట్లు చేసిన, నేనెందైన నను పోయి నాప్రాణముల బాసెద. అబ్బబ్బా! నాచేతకాదు.

తార:— రాజా! దైవమా! నీవే నాకుదిక్కు. (అని వెడలిపోవును)

రాజ:— (కొంచెము సేపు ఊరకుండి, పిదప "My God" !! అనిలోనికిపోవును, అదివరకు దూరమునుండి వినుచుండిన శ్రీధరుడు ముందరికివచ్చి స్వగతముగా,)

శ్రీధ:-ఇప్పుడంతయు తెలిసెను. దుర్బలమగు ఈనాటి హైందవసంఘ ధర్మముచే మోసగింపబడి సంకటములకు గురియైన నిరపరాధి యగు ఈపడుచు 'భ్రష్ట' యనిపించుకొనును. మోసముచేసి మోసముల దువ్వుచుండు హీనుడు శిష్టుడనిపించుకొనును. ఎట్టి దుష్కార్యములు చేసినను, ఎట్టి అకృత్యములొనరించినను ఇప్పటి సమాజమున మగవాడు మాననీయుడే. ఓరీ దుర్బలహృదయా! సౌఖ్యము ననుభవించితివి. సౌఖ్యబీజము నిందునాటితివి, దానిఫలముమాత్రము నీకు విషమాయెగదా? నీవద్దనుంచుకొని సంరక్షించుటమాని ఆమెను హింసించుటయా! (తారనుగురించి తనలో) బిడ్డా! దుఃఖింపకుము. నేనుసిద్ధముగానున్నాను నీసేవజేయుటకు-పేదనగుగాక, కడుబీదనగుగాక, నిన్నాదరించుటకు-నేను సిద్ధుడ. దీనివలన నాకెట్టికష్టములు గలిగినను కలుగనిమ్ము. తుదకు మరణము గలిగినను కలుగనిమ్ము.

నిన్నాదరించితినా, నానౌకరీకథ ముగిసిపోవుట నిశ్చయము. భీమసేనరావుగారు ఖండితముగా నన్ను గెంటివేయుదురు! ఇంటిలో మహాలక్ష్మి పెద్దక్క తాండవమాడుట తప్ప వేరువైభవము లేదు. తల్లి వృద్ధురాలు.

శ్రీధరా! శ్రీధరా!! నీకెట్టి జ్ఞానము? జేనెడు పొట్టకై, సర్వప్రపంచమును సర్వకాలములయందు వ్యాపించియుండు దైవానుగ్రహమునే మరచితివా? కవి చెప్పలేదా? 'ప్రతిగింజపైనను ఏదియేది ఎవరెవరికి జేరవలెనో వారివారిపేరు వాటిపై ముందే వ్రాయబడియున్నదని'. పుట్టించిన దేవుడు నిన్ను సంరక్షింపక పోవునా? ధైర్యమొక్కటి కావలెనుగాక.!

“ కమనీయభూమిభాగములు లేకున్నవే పడియుండుటకు దూదిపఱుపు లేల?
సహజంబులగు కరాంజలులు లేకున్నవే భోజనభాజన పుంజమేల?
వల్కలాజిం కుశావళులు లేకున్నవే కట్టదుకూల సంఘంబు లేల?
గొనకొని వసియింప గుహలు లేకున్నవే ప్రాసాదసౌధాదిపటల మేల?
తే. ఫలరసాదులు గురియవే పాదపములు,
స్వాదుజలముల నుండవే సకలనదులఁ
బొసఁగభిక్షంబు వెట్టరే పుణ్యసతులు,
ధనమదాంధుల కొలువేల తాపసులకు. ”

ఈపడుచు తాళలేని హృదయవేదనచే ఏదైనను అకార్యమును చేయనోప్వు. నేను జాగరూకుడై యుండవలయును.

(తెరపడును.)

---

# సరి పడని సంగతులు.

## మొదటియంకము - మూడవ రంగము.

(మరునాటి మధ్యాహ్నము—స్థలము, ఊరి వెలుపల ఆంజనేయ దేవాలయము దేవాలయము స్టేజీయొక్క ముందటిభాగములో ఎడమవైపున, కుడివైపు వాకిండ్లుగలిగినట్లు ఏర్పాటుచేయబడియుండును. దేవాలయము ప్రక్కన వెనుకటి భాగమున ఒక భావి కట్టడముండును. ఇయ్యది దిగుడుభావి. చుట్టు ఒకమూరెడెత్తుగోడ కట్టబడియుండును. దేవాలయము తలుపులుతీసియుండును. పూజ జరుగుచుండును. జనసమూహము ముందరిభాగమున కూర్చొని కొందరు తబల, హార్మోనియం వాయించుచు పాటలు పాడుచుందురు. కొందరు సిగరెట్లు, బీడీలు కాల్చుచుందురు. రఘునాథుడటనుండి భజనపాటయొక్కటి ముగిసిన పిదప ముక్కుపట్టుకొని లేచి)

రఘు :—అబ్బా! ఈబీడీలఘాటుముందర సాంబ్రాణిపొగ ఎక్కడనో! ముక్కులోని వెంట్రుకలు కమలిపోవుచున్నవి. దేవాలయముదగ్గిర బీడీలు కాల్చడమేమయ్యా? పాడైన ఈబీడీలు విడచి సిగరెట్లయినను కాల్చరాదా! స్వదేశాభిమానము కాబోలును.

భాస్క:— (అందే కూర్చొనియుండి) రఘునాథా? నీదేవునికి సిగరెట్లుపొగ యిష్టమా? Fashionable దేవుడు కాబోలును. ఏదేశపు వస్తువులను స్వీకరించుచుండును. అరే! బీడీలు కాల్చు వారిని దూషించుచున్నావే! నీనశ్యముపట్టయో? ముక్కుపట్టి పొడిపీల్చిన ప్రాణాయామయోగసాధనమనుకొంటివేమో!

రఘు:— భాస్కరా? "వ్యాసంవసిష్ఠనప్తారం" యను వాక్యము వినలేదా? శ్రీవేదవ్యాసులవారే వసిష్ఠులను "స్నప్తారం" 'పొడి పిసరు తెండి' యన్నారట. అప్పుడు 'శుకపరాశరంవందే' అన్నార ట. అనగా శుకపరాశరులు ఇదో మేము వస్తిమి అనిరట. గొప్ప గొప్ప ఆచార్యులవారు, దీక్షితులు, దేవపూజవేళలందు సహి తము ఇంచుక ముక్కు బిగిసెనా పూజలూ నిలిసి మంత్రములు నిలిపి, బిరుగ్గా పొడిపీల్చి దేవునకు అభిషేకమున కుపయో గించు వస్త్రముచేత నే నాసారంధ్రమును పరిశుభ్రముచేసికొని పిదప పూజసాగింతురు.

భాస్క:— భేష్! రఘునాథ! అటువలెనె బీడీలుకాల్చువారుగూడ యించుక కంఠము బిగించెనా, దైవపూజలు నిలిపి, రెండుద మ్ములపీల్చి పూజలు సాగించవచ్చును.

రఘు:— అది పాపము.

భాస్క:— ఏలకో? అదియు ధూమపత్రమే. ఇదియును ధూమ పత్రమే. ఒక్కటి పొగాకును పొడిచేసి పీల్చుట. మరియొక్క టి అదే పొగాకునుపీల్చి పొడిచేయుట. ఇంతేకదా భేదము.

రఘు:— నీవు అవివేకివి. నీకు ఆచారము తెలియదు. సంప్రదా యము తెలియదు. దైవపూజ కాలమందు చుట్టకాల్చడమెం దైనను గలదా.

భాస్క:— పొడి పీల్చుట?

రఘు:— ఓ! ఇది వృద్ధాచారము. గొప్పగొప్ప ఆచార్యులవారు దీని నవలంబించినారు. ఇందు యేదోషములేదు,

భాస:— అయిన ఆచార్యులవారికి ఏది యావశ్యకమో అదిసదా చారము. ఏది యనావశ్యకమో అది దురాచారము. ఇదియే నాఇష్టటిఆచార సంప్రదాయము,

(అప్పుడు మరల భజనపాట మొదలిడుదురు. పాటసగము పాడుచుండగా, భీమ సేనరావుగారు పట్టుబట్టలతో చేతిలోగిండితో ప్రవేశింతురు. పాటలు నిలుపుదలచేయబడును, బీడీలు త్రాగువారు బీడీలను పారవేయుదురు. రఘునాథుడు, మరికొందరు లేచి సమస్కరింతురు.)

భీమ:__ ఏమి పాడుకంపు? ఇదియే ఇంగ్లీషు చదువుఫలము. నారాయణ! నారాయణ!!

(అనుచు పొడిడబ్బీ తెఱచి నస్యముపీల్చును, అప్పుడు దేవస్థానము లోపలనుండి విద్యాలంకారాచార్యులు చిరునవ్వుతో ప్రవేశింతురు. వారికి సాష్టాంగదండ ప్రణామంబు చేయుదురు.)

విద్యా:__ మహదైశ్వర్యాభివృద్ధిరస్తు, వచ్చితిరా! నేనిప్పుడే లోపల ఏదో కొంచము సత్కాలక్షేపము చేయుచుంటిని. తమధ్వనివినిన తక్షణమే.........

భీమ:__ అయ్యో! నాపైన ఎంతబరువు మోపితిరి. నన్ను పాపములకు గురిచేసితిరి. మీసత్కాలక్షేపమునకు అంతరాయమైన నాధ్వనిపైననే నాకు విసుగుపుట్టునట్లుచేసితిరి. మీరుచేయుచుండు ఘనకార్యమునువిడిచి నాకొరకై ఆతురతతో రావచ్చునా?

విద్యా:__ రాయలవారూ!

"సిరికిం జెప్పఁడు, శంఖచక్రయుగముం జేదోయిసంధింపఁ డే-
పరివారంబును జీరఁ, డభ్రగపతింబన్నింపఁ డాకర్ణికాం-
తరధమ్మిల్లముఁ జక్కనొత్తఁడు, వివాదప్రోత్థితశ్రీకుచో-
పరిచేలాంచలమైన వీడఁడు, గజప్రాణావనోత్సాహియై."

పురుషోత్తముడగు ఆహరి భక్తశ్రేష్ఠులకు దాసానుదాసుడుగదా!

భీమ:__ (కనులు మూసికొని) ఆహాహా!!! మహానుభావుడు, హరి, పరమపురుషోత్తముడు, ఆయనకథలు వినుటవలననే, జన్మము పావనమగును. అనంతనామములు ఆయనకుకలవు. అందులో 'భక్తపరాధీను'డను బిరుదు మిక్కిలిశ్రేష్ఠము. కేవలము భక్తపరాధీనుడతడు.

విద్యా:— అవును. ఏమనవలెను? ఆహారిని ఏమనవలెను. హరి, హరియే!

భీమ:— కదా! మరి.

విద్యా:— మీధ్వని వినినతక్షణమే నేనువచ్చినది.......

భీమ:— కాదు, కాదు. మడుగు, మైల, ఆచారము మీబోటివారికి ఉండునుగదా!

విద్యా:— రాయలవారూ! ఆచారము; యేమిఆచారము!! మీబోటి విచారపరులవారిదగ్గరనా, నాఆచారము? మీపాదసంచారముండిన స్థలమునచేయునదంతయు సదాచారమే!

భీమ:—అయ్యో! అపచారము. అట్లనవచ్చునా? నేనెంతటివాడను, నాయోగ్యతయేమి? ఏదో మీఆశీర్వాదబలమువలన సదాచారసంపన్నుడను కీర్తిని కొంచెము సంపాదించితినేగాని, తుదకు భక్తుడనుపేరుకైనను నేనుపాత్రుడనా?

విద్యా:— స్వామి! నన్నేల అడుగవలెను? లోకులనడుగుడు. మీసత్యనారాయణపూజల నడుగుడు. మీతులసీమాలల నడుగుడు. మీదేవాలయము నడుగుడు. (కన్నులుమూసికొని) ఇదంతయు తమయౌదార్యము.

భీమ:— "కాయేనవాచామనసేంద్రియైర్వా,
బుద్ధ్యాత్మనావాప్రికృతేస్స్వభావాత్,
కరోమి యద్య త్సకలం పరస్మై,
నారాయణాయేతిసమర్పయామి"

విద్యా:—మీపరోపకారము, మీపూజాపురస్కారములు, మీఅన్నదాన, వస్త్రదాన......

భీమ:— ఆచార్యులవారు! క్షమించండి. ఆసంగతి ఇచ్చటఏల? ఇచ్చటచేరిన విద్యార్థులెవరు?

విద్యా:—(రఘునాథునిచూపించి) ఈచిన్నవాడు కేవలముభక్తుడు. ప్రతిదినమును పుష్పం, ఫలం, దక్షిణ సమర్పించుచు ప్రాణదేవులవారిసేవ చేయుచుండును. ఏదో యథాశక్తిస్వామి! ఇప్పుడిం

గ్లీషు చదువుకొను విద్యార్థులలో ఇట్టివారు దొరకుటయే దుర్ల భము. ఇట్టివారు ఒకరిద్దరున్నారు గనుకనే ప్రపంచముజరుగును.

భీమ:— మిక్కిలి సంతోషము. (రఘునాథునిగురించి) నాయనా, నాయింటికి దినదినమునువచ్చి తీర్థము తీసుకొనిపోవుము.

(భాస్కరుడు, మిగతవారును నవ్వుచుపోదురు. భీమసేనరావు వారివైపు చూచును.)

విద్యా:—చూచితిరా! నవ్వుచుపోయిరి. పెద్దలనుచూచిన ఎంత తిరస్కారము చూడండి, కాలమహిమ! ఇంగ్లీషువిద్య! అదో ఆఖాదిటోపి వేసుకొన్నాడే వాడే ఆవానరసేననాయకుడు.

భీమ:—(నవ్వుచు) ఆయవివేకి కలియుగపురుషుడగు. ఆగాంధీశిష్యు లలో నొక్కఁడుగాబోలును. పేరు మహాత్ముడు. చేయుపనులో వర్ణసంకరము, జాతిభ్రష్టత్వము,చండాలస్పర్శ. ఎచటచూచినను "మహాత్మగాంధీకిజై" ఏమి ఆయనప్రభావము! సత్రములగ ట్టించినాడా? దేవాలయముల గట్టించినాడా? బ్రాహ్మణుల కే దేని సంతర్పణలనేమైన చేయించినాడా? శాస్త్రముల జదివి నాడా? ఏమియులేదు. ఎప్పుడుచూచినను అందరు ఒక్కటే! అందరు ఒక్కటే!! ఇదియే ఆయనమంత్రము. బ్రాహ్మణులు, శూద్రులు, హిందువులు, ముసల్మానులు, స్త్రీలు, పురుషులు అందరుఒక్కటే. ఇదేగాంధి మంత్రము, గాంధీమంత్రము ఒక్క టే. తప్పతాగితే బ్రాందీమంత్రము ఒక్కటే. అందరుఒక్కటే నా? గాడిద, గుర్రము ఒక్కటే ఎట్లుఅవును? ఏమోకాలము చెడిపోయినది. కాలము చెడినప్పుడు అందరు మహాత్ములే.

విద్యా:— రాయలవారూ! ఆపాడుకథ మనకెందులకు ఏదో మన సత్కాలక్షేపము మనకు ముఖ్యము. ఇది కలియుగము. బ్రా హ్మణుల కధికారమేలేదు. బ్రాహ్మణుడే రాజైయుండిన..... పోనీయండి! కలియుగమింతే. ఏదో మనబోటివారుండి కృత యుగమునకు వేగిరముగ సర్వధర్మములను సేకరింపవలెను. రండి! హారతికి వేళయయినది. మీరువచ్చినదే కేవలము మా భాగ్యోదయము.

(అని వేదపఠనము గావించి, హారతిపాట పాడుచుండగా, విద్యాలంకారా చార్యులవారు మంత్రపుష్పములను చెప్పుచు, తీర్థప్రసాదములనిచ్చి "ధన ధాన్య కీర్తి సంతాన సంప్రాప్తిరస్తు" అనిఆశీర్వదించును. అందరు వెడలి పోవుదురు. పూజారి గుడితలుపుమూసికొనిపోవును. ఇదివరకు దూరమునునిలు చుండిన శ్రీధరుడు ముందుకువచ్చి స్వగతముగా)

శ్రీధరు:— అయ్యో! ధర్మమా! దైవమా! ఎక్కడిధర్మము! ఎక్కడిదైవము? ద్రవ్యమేధర్మము! ద్రవ్యమేదైవము! బ్రాహ్మణునకు నీచమగు సేవావృత్తి ప్రాప్తమైనపిదప ధర్మమెక్కడ? దైవమెక్కడ? ఇదియేమి సంఘము? హృదయమున ఇంచుకైనను పశ్చాత్తాపము, పరోపకారబుద్ధి ప్రేమ లేనిసంఘము. వీరు దేవాలయములను కట్టించు ముఖ్యోద్దేశము ఆదేవుని మోసగించుటకేయని తోచుచున్నది. సర్వాంతర్యామియగు దేవుడు అన్నిచోట్లయందు ప్రత్యక్షముగ నుండినయెడల వీరి పాపకృత్యములను చూచునేమో యనుభయముచే ఆదేవునిపట్టి కట్టితెచ్చి ఒక్కచోపడవైచి, చుట్టుదేవాలయముగట్టి తలుపులు బిగించి దేవునికి నిర్బంధముచేసినయెడల, తాము ఇతరచోట్ల చేయు పాపములు దేవునికి తెలియకుండునని వీరుపన్నిన ఉపాయమని నాకు తోచుచున్నది. ఇట్టినిర్బంధమునకు పరమేశ్వరుడెన్నడైనను లోబడునా? విద్యాలంకారా చార్యులవంటి బ్రాహ్మణులకు దేవుడెన్నటికైనను ప్రసన్నుడగునా? ఇది రామచంద్రుని గుడి. మారీచాది మాయావిరాక్షసుల మోసముల గుర్తెరిగిన మహానుభావుడు ఈవిద్యాలంకారా చార్యుల మోసమును గుర్తెరుగకయుండునా? ఇతనికిదేవస్థానము ద్రవ్యస్థానము. శ్రీరామచంద్రుని పూజలకంటె ఇందు వకీలు భీమసేనరావు పూజలుహెచ్చు. అయ్యయ్యో! ఇచ్చోటనైనఐదునిముసములు మనసు పరమేశ్వరుని పాదారవిందములందు సమర్పించి సర్వ ప్రపంచ క్షేమమునకై ప్రార్థనల నొసగకూడదా? ఇచ్చట గూడ హెచ్చుతగ్గుల సంవాదమా? ఇచ్చటకూడ జాతిభేదముల చర్చయా? కేవలము ప్రేమమూర్తియైన దయామయుని సాన్ని

ధ్యమునగూడ మహనీయ దూషణయా? ఔరా రాముని కొక్క నామము. జగదేకవంద్యుడై, సకలదీనజన బంధుడై, వక్రసమాజ, క్రూరాచారసముదాయ పరంపరచే బాధింప బడు హతభాగ్యలపాలిటి కరుణోద్ధాముడగు గాంధీమహాత్మున కొక్కయవమానము. (ఉద్రేకముతో) మహానుభావుడగు మహాత్మా గాంధీని దూషించిన ఈపాపపు ప్రదేశమున శ్రీరామచంద్రు డెన్నటికైన నిల్చునా. ఇతడు నిక్కంపు రాముడైన... (అని చెప్పుచుండగా, తార ప్రవేశించుట చూచి వెనుకకు చనును.)

తార:— (ప్రవేశించి గుడివాకిండ్లు బీగమువేసినదిచూచి) రామా! రామచంద్రా!! కడపటిదర్శనముకూడ నాకు ప్రాప్తి లేదా? ఒక్కసారి వాకిండ్లు నీవే తీసివైచి నాకు దర్శనమియ్యలేవా? నీపాదకమలములధూళి సోకినంతనే కారాగృహపు గడియలు తాళములు, వీడిపోయెనను గాధయున్నది. అది కల్లయేనా? అయ్యో! నిన్ను నిర్బంధమున ఉంచినారే! నీవే నిర్బంధము నుండి తప్పించుకొనుటకు శక్తుడవుగాకున్న నీభక్తుల నెట్లుకాపాడుదువు? రామచంద్రా! హృదయమున విషము నిండియుండ, దయయు, దానమునెరుగని హస్తములచే కపటవేషధారులగు పూజారుల యభిషేకముల ననుభవించుచున్నావు కాని అనాథయై, ఆర్తయై, మోసగింపబడినదై, దిక్కులేక, ఇప్పటి దుర్బలసమాజపు కఠోరమగు కట్టుబాట్లకుజిక్కి రోదించు హిందూస్త్రీ దుఃఖాశ్రుతరంగముల అభిషేకములెటుండునో నీకొక్కసారి రుచిచూపింతు. రామచంద్రా! వాకిలి తెరువుము. నిన్నే మియు అర్థించను, ఒక్కింతయైనను తొందరచేయను. నీకు జగత్కర్తయను బిరుదుకలదు. నీకు జగత్సాక్షియను పేరుకూడ గలదు. నిజముగా నీకు గన్నులున్నవా యని పరీక్షించవలయును. కన్నులులేవా? గ్రుడ్డివాడవా? ఈప్రపంచమున జరుగుచున్న ఘోరపాపమొక్కటియైన గుర్తించలేవా? రామచంద్రా! నీకును ఆచార్యులవారి కట్టుబాట్లకలవా! శాస్త్రములు

నిన్ను గూడ వేధించుచున్నవా? రామచంద్రా! నాయందుండు శిశువు నీకుకూడ భారమా? శ్రీరామచంద్రా! రామా! నా యాశయంతయు, నాభారమంతయు నీపైన పెట్టుకొనియున్నాను. నిక్కముగ నీవేకదా నాప్రియుడు. లోకమునకే ప్రియుడైన వాడు నాకు ప్రియుడుగాకూడదా? ప్రియా! నీవిచ్చిన ప్రాణముల నీకే సమర్పింతును.

రామచంద్రా! నే వట్టిభ్రాంతను, నీకెన్నటికైనను స్త్రీలపైనదయ గలుగునా? కలుగదు! నిను మోహించిన శూర్పణఖను నిష్కారణముగ ముక్కుగోయించితివి. వలదనినపోవుచుండెనే! ముక్కు గోయింపవలయునా? నీవే పరదైవమనినమ్మి, కలయందైనను కళంకముకానని జా కిని అడవులకుబంపి అగ్నిప్రవేశము చేయించితివి. హా! నాకుదిక్కు నీవుగావు! ఇదిగో ఈబావియే. ఈదౌర్భాగ్యప్రదేశమునందు నాయట్టి నిరాధారలగు వితంతు స్త్రీలకు జలములే ఆధారములు. అమ్మా! అనాథబంధూ! అమృతసింధూ! (అనిప్రార్థన చేయుచుండును. శ్రీధరుడు ప్రక్కనుండి తటాలునవచ్చి)

శ్రీధరు:___ బిడ్డా! తారా! ఆపనిచేయకుము. నీవు చేయగూడనిదిట్టి పని. దుఃఖమెన్నటికిని అవార్యముగాదు. తారా! నీసేవచేయుటకు సిద్ధముగానున్నాను. తారా! ఎందులకిట్లు సాహసించితివి?

తార:___ శ్రీధరా! పౌరుషధర్మమే నాశనమైనది.

శ్రీధరు:___ నీవాడినది సత్యము. నీసమాచారమును నేనాకస్మికముగ గుర్తెఱింగితిని. ఆనాడే నిన్ను బాధలనుండితప్పించి, నీకు ధైర్యము నొసగవలసియుండె. మనప్రకృత సమాజముయొక్క నిర్వీర్యత్వమునకు ఇంచుక చిక్కియుంటిని. ఇప్పుడు ధైర్యము చేసితిని. నిజముగ పురుషుడనైతిని. తల్లీ! రమ్ము నాయింటికి. నన్ను గన్నతల్లి నీకు సర్వసౌఖ్యములనిచ్చి నీమనసునకు శాంత త కలుగజేయును. సంతోషమున నిన్ను పోషించును. ఆమెకు వయస్సయినది. ముసలిది. నేడో, రేపో, హరిచరణముల చేర

నున్నది. నీయట్టి హతభాగ్యురాలికి ఇంచుక చేయూతనిచ్చిన సంతసముగ తన జీవయాత్ర ముగించును. రమ్ము. పోవుదము.

తార:— అయ్యా! ఈప్రపంచమున నేనుండి ఎవరికేమి లాభము చేయవలయును?

శ్రీధరు:— బిడ్డా! ఈప్రపంచమునకు ఎవరినుండిమాత్రమేమి లాభము? రమ్ము పోవుదము.

తార:— అయ్యా! నానుంచి నీకునష్టమగు. నీకు పనిపోవును. పిదప మిక్కిలి కష్టమువాటిల్లును.

శ్రీధరు:— తారా! నాపనిపోవునా? పోవనిమ్ము. వంచకుని ధర్మవిద్వేషిని అందువలన దేశద్రోహిని సేవించుటకంటే ఆకలిచే శుష్కించుటమేలు; ఇట్టి నీచసేవవలన నాపొట్టకు ఇంచుకలాభము కలిగినను, నాఆత్మగౌరవమునకే నష్టముగలుగుచున్నది. గౌరవమునియ్యని ఆహారముచే పెంచిన దేహము ఉండుటకంటె, మడియుటయే మేలు. నీనుంచియైనను, నే నీ నీచసేవనుండి విముక్తుడనయ్యెదను నాకు కష్టముగలుగునంటివి. కలుగునని తెలియునుగాని నీకష్టమునకంటె నాకష్టములు హెచ్చా? పరుల కష్టములందు పాల్గొనుటయే పరమధర్మము. పరమేశ్వరుని నిక్కంపుపూజ.

తార:— అయ్యా! నానుంచి నీకు అపకీర్తివచ్చును. నీబంధువులు మిత్రులు, విడనాడుదురు.

శ్రీధరు:— అపకీర్తియా? ఆర్తులకుసాహాయ్య మొనర్చుట అపకీర్తియా? అనాథులరక్షించుట అపకీర్తియా? యోచనచేయకుము. నావెంటరమ్ము నాసేవగైకొనుము.

తార:— ఇంకెవరుదిక్కు నాకు? రామా! ఇదియును నీకరుణారసమే......(అని ఇంకనుఏదియో చెప్పబోగా)

శ్రీధరు:— హా! హా!! తారా! తారా!! వలదు. వలదు. అందు దేవుడేలేడు. వట్టిరాయియున్నది. భక్తులహృదయము ఎప్పుడు శ్మశానమాయెనో అప్పుడే విగ్రహము పాషాణము గాక మరే

మగును? అర్చకులకు సద్భావములేదు. విగ్రహములకు ప్రభావమేలేదు. ఒకప్పుడు దేవాలయములయందు దివ్యమగుశక్తి యుండెను. స్వార్థత్యాగులై, భూతదయయను నిర్మలనదీ ప్రవాహమున స్నానముచేసి, లోకసేవాగంజితమగు వస్త్రములను ధరించి పరమేశ్వరుని లీలావిభూతిని నొసట నలంకరించి ప్రపంచక్షేమమే తమక్షేమముగా భావించి, ధ్యానముచేయు మహనీయులు, ఇందు కలియుచుండిరి. కావున దేవాలయములు దివ్యశక్తిగలిగి ప్రతిప్రాణులకు పరమానందము నొసగుస్థలముగ శోభించుచుండెను. ఒకానొకప్పుడు ఈస్థలము యోగసాధనమునకు, ఆత్మపరిశోధనమునకును అనుకూలముగనుండెను. ముక్తికమార్గముగనుండెను. ఒకప్పుడీదేవాలయము ప్రపంచమునకే చిత్రపటమై మానవకోటికే శరణాలయముగ నుండెను. ఇప్పుడో అర్చకుల స్వార్థతకు ప్రదర్శనాలయము. ముందువారికి ద్రవ్యముస్పర్శనమిచ్చినగాని, దేవుని దర్శనమబ్బదు. వారుచూపిన దేవుడే మనకుగతి. దేవుడిప్పుడు దేవుడుగాదు. మృగారామము (Zoological Gardens) లలోనుండు విచిత్రమయిన ఒక జంతువు. దుడ్డిచ్చినగాని చూచుటకు సాధ్యముకాదు. తారా! లేదు! లేదు!! రాముడిందులేదు. ప్రేమలేనిచోట రాముడుండునా? అయ్యయ్యో! మనదేశీయుల హృదయమున పరిశుభ్రమైన శక్తిప్రేమలుండెనా, స్వదేశము, స్వరాజ్యము, వేయేల, అప్పట్టున మనము స్వర్గమునే యనుభవించుచుంటిమి. రమ్ము పోవుదము.

(నిష్క్రమింతురు)

# సరిపడని సంగతులు

## రెండవఅంకము-మొదటిరంగము

### (శ్రీధరునియిల్లు)

(గోడకు ఇనుపమేకులు కొట్టబడియుండి, అందుకు కోటు, పంచ తగిలించియుండును. రెండుకట్టెపెట్టెలు మూలకుచేర్చబడియుండును. స్టేజీముందటి భాగమున ఒకచిన్ని బల్లపైన శ్రీధరుడు కూర్చొని ఏకతారా వాయించుచు స్వగతముగా)

శ్రీధరు:—

"గణనీయంబగు నెంతకష్టమయినన్ క్ష్మాభారమున్ భూరిధా-
రుణిభృద్భాగముదోర్బలంబుననో, ఘోరంబౌతపశ్శక్తినో,
ఫణివంశాగ్రణిహార దివ్యవరసంపల్లభ్యమాబల్మినో,
ఋణభారంబమితంబగణ్యమసహంబెవ్వానికిన్ ధాత్రిలో."

దరిద్రదేవతకు సాటియేలేదు. ఋణబాధకు మేటియేలేదు. దారిద్ర్యము, ఋణము. ఆహా ఎట్టిజత! ఎట్టిదాంపత్యము! పార్వతీపరమేశ్వరులనుమించిన దాంపత్యము. శివునకు పార్వతియర్ధాంగియే. అయిన దారిద్ర్యమునకు ఋణము పూర్ణాంగము. ఈ దేవతలు అన్యోన్యానురాగముతో ఏయింట తాండవమాడుచుందురో ఆయిల్లు శ్మశానమునకుకూడ పుట్టినిల్లనదగు. దారిద్ర్యముండిన మనసునకు శాంతియెట్లు? ప్రపంచమున నిపుణత్వము, కవిత్వము, మేధాశక్తి, యోగసామ్రాజ్యము వీటికి దారిద్ర్యమే జన్మభూమియందురు. మనోవైభవము దారిద్ర్యము వలన కలుగునా? ఏమో! ఎవరెరుగుదురు?

ఒక్కటిమాత్రము నాకనుభవమగుచున్నది. ఎట్టిదరిద్రదశ బాధించుచున్నను చిత్తచాంచల్యము మాత్రము నన్ను వదలకున్నది. అయ్యో! నాకేల యిప్పుడిచింత? మనసునప్రేమవేదనమొకచోట, దారిద్ర్యరోదనమొకచోట. చిత్తమా! పక్షివలె ఎగిరిపోవుచున్నావు! ఏల నిన్ను నీవే మరచుచున్నావు? చందమామకై ఆశించుచున్నావు సుమా! (మరల ఏకతార తీసికొని)

"తృష్ణాతోయేమదనపవనోద్ధూతమోహోర్మిజాలే,
దారావర్తేతనయసహజగ్రాహసంఘాకులేచ,

సంసారాఖ్యేమహతిజలధౌమజ్జతాంనస్త్రిధామన్
పాదాంభోజేవరదభవతోభక్తినావంప్రయచ్ఛ."

(మరల ఏకతారను ఆవలనుంచి) తెలియజేయుదునా? తాళలేను. ఈతాపమును తాళలేను. తెలిపెదను. ఇందేమితప్పున్నది? నా మాటలువిని నన్ను పరిహసించును. అప్పటికైనను నాయాశ నన్ను వీడిపోవును. చెప్పెదనుగాక.

ఆహా! యోచింపకపోయితిని. నన్నేదైవముగా దలచినది. నాకుసౌఖ్యోపచారములు చేయుటయే తనవ్రతముగా భావించినది. నామాట వేదవాక్యముగ భావించినది. అట్టితార నాసౌఖ్యము నుద్దేశించి తనయౌవనమును, శృంగారమును, మాధుర్యమును కళాసంపదను బలియిచ్చుటకు ఒప్పిననెట్లు? కూడదు, కూడదు. నాదెంతక్రూరహృదయము! ఆమోహనమూర్తిని నాయీదరిద్రవిగ్రహమునకు బలియిచ్చుటకు సిద్ధమగునో యేమో! ఛీ! నాకేల ఈచపలత! మొదటినిశ్చయమే యుండనిమ్ము.

దారిద్ర్యమునకు, ప్రేమమయమగు వివాహమునకును మిగుల దూరము. ప్రపంచమున స్త్రీల విశ్వాసమునకు పాత్రుడు గావలెనన్న భాగ్యవంతుడు అయినను గావలెను. బుద్ధిమంతుడైనను గావలెను. తుదకు తేజోవంతుడైనను గావలెను. తొలుత నేదరిద్రుడను, అనగా లక్ష్మీదేవియు నేనున్ను దాయాదులము. కనుకనే నాకును ఆమెకును చూపులుగూడలేదు. బుద్ధియా! మొదటికే లేదు. వకీలు గుమాస్తా పనికికూడ బాగా అర్హుడుగాని నేను మరియేపనికి అర్హుడను? ఏపాటిబుద్ధిమంతుడనగుదును. ఈపాటులన్నిటికన్న సాపాటునందే చాతుర్యమెక్కువ. వర్చస్సంతకును తక్కువ? ఆహా! ఎట్టియుపద్రవము కలుగజేయబూనియుంటిని. ఇదిప్రేమమా? కాదు, కాదు. ఉభయులకు జీవహింస కలుగజేయునది విషసంకలిత కామముగాని ప్రేమముగాదు.

పొరపడుచున్నాను. ఇదే నామనోదైవసాక్షికముగ పలుకుచున్నాడ. తారయందు నాకు స్వచ్ఛమైన నిష్కళంకమైన, నిస్సంకోచమైన పరిపూర్ణమైన ప్రేమముగలదుగాని ఇది తుచ్ఛకామ

మెన్నటికినిగాదు. అవును. అవును. (రెండు మూడుతూర్లుపచారుచేయును. తటాలున నిలచి)

నేనంత హేయముగనున్నానా? తారకు నాపై ప్రేమగలుగ కూడదు అంతటి ముసలివాడనా? నలుబదియేండ్లకే వార్ధక్యమా? పాశ్చాత్యదేశమున నలువదియేండ్లేకదా పెండ్లికితగిన వయస్సనిభావము! ఇక దారిద్ర్యమా! ఋణమున్నను గుణములేమనాకు. సంపాదింపలేనా? తారను జేపట్టుభాగ్యము నాకు గలిగినయెడల నేను ఇంతింతై మరి అంతై వ్యాపించి బండపై బంగారము నార్జింపలేనా? ఇదియునుగాక ఆమెకు భూషణము దుఃఖము; నాకు భూషణము దారిద్ర్యము; మంచిపొందిక! మంచిపొందిక! ఆమె ననుజూచి సంతసమొందును. నేను ఆమెను జూచి సంతసమొందుదును. దుఃఖము, దారిద్ర్యమునుచూచి సంతోషించును. దారిద్ర్యము దుఃఖమునుజూచి సంతోషించును. ఇందు సందేహములేదు. ఖండితముగ తార సమ్మతించును.

అయ్యో! యౌవనమే! ప్రతిక్షణమును ప్రపంచమును పలుతెరంగులగు రంగులచే ప్రకాశింపచేసి హృదయమున ఆనందతరంగములను అల్లకల్లోలముగ పుట్టించుచు స్వర్గసామ్రాజ్యమునే స్ఫురింపజేయజాలు యౌవనమే! యౌవనమే! మనోవ్యాకులతను చీకాకుపరచుచు, దుఃఖమును ధ్వంసముచేయుచు, అసాధ్యమును సాధ్యముచేయుచు, నిరర్థకమును సార్థకముచేయుచు, దుర్లభమును సులభముచేయుచు, ఎగురుచు, అరచుచు, నగుచు, నాట్యముచేయుచు, ప్రకృతినే తనదాసిగచేయచూచుయౌవనమే! సహజమగు యౌవనమే! అట్టియౌవనపు సంపూర్ణసామ్రాజ్యము కళలుజూపినపిదప, దైవమా! నేనేమి యపరాధ మొనర్చితినని నన్నిట్లు బాధించుచున్నావు? నామనస్సునీ స్వత్వమని జూపుటకా నన్నిట్లు పీడించుచున్నావు? ప్రేమయను శబ్దమునకు హృదయాగ్ని, అంతర్వేదనము అనియర్థము. ప్రేమమా! తొలగిపొమ్మునానుండి. నామనసును రాయిచేసి, నాస్వాధీనముచేసికొనియెదను. చేతనధర్మముగదా వేదన! అచేతనపదార్థమునకు దుఃఖమెక్కడిది?

(అని మరల ఏకనాదమును తీసికొని పాడుటకు ప్రారంభించును. పాడుచు, ఆడుచు, చెప్పరాని సంకటమును అభినయించుచు తంతెను త్రెంపివైచి తటాలునలేచి, ఇటునటు తిరుగుచు ఏడ్చుచు)

కాదు, కాదు. నాచేతగాదు. ఆసాధ్వీమణి ప్రేమమూర్తి, ఆమోహనాంగి మోహనమూర్తి, ఆవనిత విశ్వాసవిగ్రహము నా మనఃపీఠముపై నెలకొల్పి ప్రతిష్ఠగావింపబడి ప్రతిక్షణమును పూజలుగైకొనుచున్నది. తార మోహనాకారము నాహృదయము నందంతయు నిండుకొనియున్నది. నామనస్సు నాయది కాదే. ఇట్టిరాయిచేయునట్టి నాపాటయందు తార. నాఏకతార యందు తార. నేనుచూచునది తార. నేమాటలాడుచుండునది తార. నేకూర్చొనిన తార. లేచినతార. తారా! నిన్నెట్లు మరతును?(మరల కనులుమూసికొని).........

(తార శ్రీధరుని యవస్థగని ఆశ్చర్యమునుచూపుచు నిలుచును. శ్రీధరుడు తెప్పరిల్లుకొని)

శ్రీధ:— తారా! వచ్చితివా. ఇదే నీవుకోరిన పుస్తకమును తెచ్చితిని.

తార:— క్రొత్తపుస్తకమే. అయ్యో! నాకొరకు ఒక్కరూపాయ వ్యయముచేసితిరే. ఇప్పుడు మనకుండుస్థితిలో......

శ్రీధ:— వీరణ్ణశెట్టిగారు లక్ష్మీపుత్రులుగ నుండువరకు నాకేమి తక్కువ? పుస్తకమును తీసికొనుము. నేను మరల అంగడికి పోవలయును. అచ్చట-నీతోచెప్పను మరచిపోతిని-నిన్నరాత్రికొంచెము ప్రమాదము సంభవించినది. దుకాణము పెట్టియుండిన ఇనుపపెట్టిలోని కుదువసొమ్ములలో ఒక్కచంద్రహారము కనబడదు. ఎట్లుమాయమైనదియో ఎవరికిని తోచకున్నది. పోలీసువారు విచారణకై వచ్చుచున్నారు. నేనిప్పుడే పోయివత్తును. నీవీపుస్తకమును జదువుచుండుము.

తార:—మీరు పుస్తకమునకు ఒక్కరూపాయను కర్చుపెట్టినది నాకేమాత్రము సరిపడలేదు. వీలైన ఈపుస్తకమును వాపసు చేయుడు.

శ్రీధర:— ఆ! (నవ్వి) సాధ్యముగాదది. పోనిమ్ము. నీకు సారంగధర నాటకము జదువుటకు ఏల కుతూహలము గలిగినది?

తార:— ఎచ్చటచూచినను ఈనాటక ప్రశంసయే. ఆంధ్రనాటక పితామహులు ఏదో నూతన ఫక్కి ననుసరించి ఈనాటకమును వ్రాసియున్నారట. ఎట్టియోగ్యమగునాటకమో చూడవలెనని యాశ.

శ్రీధర:— తారా! ప్రపంచమున యోగ్యమగు కథకంటెను అనుకూలత కలగించు కథయందే ప్రీతి హెచ్చు.

తార:— ఈనాటకమువలన కలుగు అనుకూలతలెవ్వి?

శ్రీధర:— చెప్పెదను వినుము. ముసలివాడు పడుచుపిల్లను పెండ్లి చేసికొనవచ్చును. పెండ్లికొడుకు కాటికి కాలుజాచినను పెండ్లి కుమార్తె కూటికిచేయిచాచునదై యుండవచ్చు. కన్య అప్పుడే కండ్లుతెరచుటకు యత్నించునదై యుండవచ్చు. వరుడు ఎన్నడో కండ్లుమూసికొనుటకు సిద్ధుడైయుండనోపు. కన్యకుపాలపండ్లు వీడకపోయినను తప్పులేదు. వరునికి పక్కపండ్లు సైతము రాలి యున్నను బాధకములేదు.

పౌరుషహీనమైనకామమును పూరించికొనుటకై, న్యాయమునకై- కాదుకాదు-కోర్టున్యాయమునకై అంగభంగముచేయింపవచ్చును. మగవాడు చేసినదోషమునకు మగువను దూషించుటయే సతీపతుల ధర్మమని భావింపవలెను.........

తార:— అట్లనా! ఈనాటకమున అసమవివాహమువలన కలుగు అనర్థములు మగవారిపక్షమున ప్రశంసింపబడినవా? అదియట్లుండనిమ్ము. అయ్యా! నిన్నొక్క ప్రశ్నయడిగెదను. నిజమైన పరస్పరప్రేమ కలిగియుండిన వయసునందలి తారతమ్యము లెక్కకువచ్చునా?

శ్రీధర:— ఏమంటివి? వలదు. వలదు. గ్రహించితి. ఎందుకనగా మనసు......పరస్పరము......వయసు.........

తార:— ఏమికలతచెందుచున్నారు?

శ్రీధర:— తారా! నీవు చెప్పునది నిజమేగాని సాధ్యగాదు......

కాదు. కాదు. ప్రేమమహిమ నేనేమని చెప్పుదును? ప్రేమ స్థిరమైన, దృఢమై పదార్థము. అట్టిప్రేమకు, చాంచల్యప్రధానమైన మనసు జన్మస్థానమెట్లగు? అనగా మనశ్చాంచల్యము అంతరించువరకు ప్రేమబీజమునాటుటయే కష్టమేమో......!

తార:— మీరేమాటాడుకొనుచున్నారే! నాకర్థమగునట్లు చెప్పరాదా?

శ్రీధర:— తారా! ప్రేమయిట్టిదియని చెప్పుటకుసాధ్యముగాదు. అయిన ఇట్టిదికాదనిచెప్ప నలవియగునేమో!

తార:— ఇట్టిదికాదనగా ఎట్టిదికాదు?

శ్రీధర:— తారా! ప్రేమము కామముకాదు. మోహముగాదు. స్వార్థముగాదు. వశీకరణముగాదు. వంచనగాదు. మంత్రముగాదు. తంత్రముగాదు. ఆకర్షణయంత్రముగాదు. నశించునదిగాదు. చిక్కిపోదు. చిన్నపోదు. వాడునదిగాదు. కష్టములు వచ్చెనని వీడిపోదు. చీకటిని వెన్నెలగాచేయును. పేదను పెద్దనుగాచేయును. ఇహమందే పరమును ప్రత్యక్షముచేయును. భూషణములనడుగదు. అలంకారముల నపేక్షింపదు. ఒక్కరికి చిక్కదు. అయిన సర్వప్రపంచమును చిక్కించుకొని తరింపచేయుటకై వేచియుండును......

తార:—కొంచెము తెలిసినట్లాయెను. అబ్బా! ఎంతపెద్దవిషయము. అయిన మరలనడిగెదను. ఇట్టిప్రేమశక్తికి నశ్వరమైన ఈదేహమునగడచిపోవు వయసు అభ్యంతరమగునా? అయ్యా! ముసలితనమనగా నేమి? ముసలివాడనగనేమి?

శ్రీధర:— ......

తార:— ముసలితనమెప్పుడు ప్రారంభమగును?

శ్రీధర:— ......

తార:— పోనిమ్ము. యౌవనమెప్పుడు ముగిసిపోవును?

శ్రీధర:— ......

తార:— వీనివిషయమై శాస్త్రిమేదైనగలదా?

శ్రీధర:— తారా! నాకేమి తెలియును?

తార:— అట్లుగాదు. నాకు తెలసికొనవలయునను కుతూహలము? మీకిదివరకు పెండ్లికాలేదే, ఇప్పుడ పెండ్లి చేసికొనగూడదా.

(మిక్కిలి మనోవేదననభియించుచు. అప్పుడులోనుండి శ్రీధరునితల్లి, నాయనా, భోజనము ముగించి మరలమాటాడరాదా? అనిపిలుచును వెంటనే తార లోనికిచనును)

శ్రీధర:— అమ్మా! ఇదేవచ్చితి. అంగడికిపోయి శీఘ్రముగా వచ్చెద. (అనివెడలిపోవును)

---

# సరిపదని సంగతులు

## రెండవఅంకము—రెండవరంగము

(చేతిలో నోటీసునుపట్టుకొని ప్రవేశించుచు)

శ్రీధర:— నేనేమిచేయుదును? దైవము నన్నేల ఇట్లు తీక్ష్ణముగా బాధించుచున్నాడు?

(నోటీసునుచూచి)

## "సంఘసంస్కరణోపన్యాసము"

వకీలు, భీమసేనరావుగారధ్యక్షత వహింతురు.

ఏలకో ఉపన్యాసములు? ఉపన్యసించువారు వారివారి ఆడంబరముకొరకు. వినువారు కాలహరణముకొరకు. ఈదేశములోని వాతావరణమంతయు ఉపన్యాసములచే జనించినవేడిమివలననే ఎండిపోయి, వర్షములురాకున్నది. విద్యార్థులకుగూడ ధైర్యము చాలకయున్నదే. రాజారావుకేల సాహసము కలుగకూడదు? అధర్మమును బోధించు, తండ్రికివెఱచి, ఋజుమార్గమును, న్యాయమార్గమును తొలగిపోవుటయా? ఓహో! తలచుకొనినంతనే ఇచ్చటికే వచ్చుచున్నాడు.

(రాజారావు ప్రవేశించును. శ్రీధరునిచూచి)

రాజ:— శాస్త్రులవారు! తారాబాయి బాగున్నదా?

శ్రీధర:— ఆరోగ్యముగనున్నారు.

రాజ:— నేనుచూడవచ్చునా? నాపై నయింకను కోపమా? నేను పిరికివాడను నిశ్చయమే? నాతోమాటలాడిన తప్పా?

శ్రీధర:— అయ్యా! నినుగుఱించి తారాబాయిమిక్కిలి చింతించు చుండిరి. మీయట్టి విద్యావంతులగు యువకులే కార్యభాగ మున వెనుదీసి, దేశద్రోహ మొనరించుటకు సిద్ధమైనచో మఱి మనదేశముగతియేమి?

రాజ:— శాస్త్రులవారూ! లోకానుభవముగల మీయట్టివారే, సమయోచితములను, యుక్తాయుక్తములను తిరస్కరించినఎట్లు?

శ్రీధర:— అయ్యా! ఏదిభూతదయా పశ్చాత్తాపములను తిరస్కరిం పదో అట్టిది నిక్కమనియే నాయభిప్రాయము.

రాజ:— ముందు వెనుక చూడవలదా?

శ్రీధర:— అవసరములేదు. అంతరంగము ఆలకించినచో అంతయే చాలును?

రాజ:— శాస్త్రులవారూ! పిత్రాజ్ఞోల్లంఘనము ఉచితమా?

శ్రీధర:— అనాథయగు అబలను అడవులపాలు గావించుటమాత్ర ము ఉచితముకాబోలు.

రాజ:— పరుషోక్తులనాడకుడు. కన్నతల్లి సంకటపడుటయైన తలప వలదా?

శ్రీధర:— ఔరా, ధర్మము! ఔరా, దయారసము! నమ్మిన అనా థను భంగపరచి సంకటపెట్టుట తలపవలదా?

రాజ:— శాస్త్రీ! నీవాడునదినిక్కము. అయినను ఇంచుకతడయుట ఉచితము అనితోచుచున్నది. దైవముసాక్షిగపల్కెదను. నేను నిక్కముగ తారను వివాహమాడుదును. కొంచెము నాస్థితిగ తులు కుదురువరకునిదానించుము. నేనుమోసముచేయను. నిక్క ముగా మోసముచేయను. ఇప్పుడుధైర్యము వహించుటకు నాకు మనోబలముచాలకున్నది.

శ్రీధర:— అయ్యో! మనోబలములేనివాడు మహాత్ముని పూజించుటకు అర్హుడా? నీవేల మహాత్మగాంధీని పూజించెదవు? నీకేల ఈఖద్దరువస్త్రములు? ఏల ఈగాంధీటోపి? ఊరక ఉపన్యాసములిచ్చువాక్ప్రాభవమువలన దేశవైభవము హెచ్చునా? ఉపన్యాసములయందు దేశభక్తి, ఆచరణయందు దేహభక్తియా? నిర్వంచకమగు మనోధైర్యమును, నిరవధికమైనశక్తియు, నిర్మలమైన ప్రేమయు నిండియుండ, దేశమాతకు తమ సర్వమును సమర్పింప సంసిద్ధులైన భారతశూరుల శిరోభూషణము ఈ గాంధీటోపిగాని, చెప్పునది యొకటి, చేయునది యొకటి యను మతమనుసరించిన పిఱికిపందలకు ఈటోపీయేల? అయ్యయ్యో! భారతమాత తన ఆశయంతయు తనపుత్రులపైననే నిలిపియున్నదని పలుమారు లుపన్యాసము లిచ్చెదరే! మీకేల ఈపిఱికితనము? తల్లిదండ్రులులేని అనాథబాలికయొక్క హృదయమును దొంగలించితిరి. అమాయకురాలిని సౌఖ్యసాధకమగు ప్రేమప్రపంచమున కెక్కించితిరి. ప్రేమబీజమును నాటితిరి. మీవిశ్వాసరసమును నించితిరి. ఇప్పుడు ఫలించునపుడుచూచి యానందించు భాగ్యముమీకువలదా? అయ్యో! ధైర్యము వహింపుడు. మీపురుషతత్వప్రదర్శనమునకు, మీమనోదార్ఢ్యమునకు, మీసంకల్పసిద్ధికి, మీసంఘునాగరకతకును, ఇదే మంచి తరుణము.

రాజ:— (కన్నీరుగార్చును)

శ్రీధర:— మెచ్చితి. నీపశ్చాత్తాపమే నీకుభూషణము. తారతో మాటలాడుడు. పొండు. మగువల కాపాడువాడే మగవాడు సుమా!

(రాజారావులోనికి పోవును. శ్రీధరుడించుక వికాసముఖముతో స్వగతముగా)

పాపము! బహుకాలముగ తలకెక్కనపిచ్చి ఇంచుక దిగుచున్నట్లున్నది. ఏదియెట్లున్నను నాకర్తవ్య ధర్మమును నేనవిడనాడను. మున్ముందు ఈహతభాగ్యురాలి పురోవృద్ధి యెట్లున్నదో నిరీక్షింతము. —— (అని నిష్క్రమించును.)

# సరిపడని సంగతులు

## రెండవఅంకము-మూడవరంగము.

(భీమసేనరావుగారి గృహము.)

(లీలావతిదేవి కుట్టుపనిచేయుచు కూర్చొని పలుమారు వాకిలివైపు చూచుచుండగా, సేవకుడు ప్రవేశించి)

సేవ:— అమ్మగారూ! శ్రీధరశాస్త్రిని పిలుచుకొనివచ్చినాను. తలవాకిటనిలిచియున్నారండి.

లీల:— ఇంటిలో ఇప్పుడెవ్వరును లేరుకదా!

సేవ:— (తలయూచును)

లీల:— శాస్త్రిలవారిని రమ్మనుము.

సేవ:— చిత్తము. (అనిపోయి, పంపగా శ్రీధరుడు ప్రవేశించును.)

లీల:— శాస్త్రిలవారూ! కూర్చొనుడు. మీరువచ్చినందుకు నాకు సంతోషమాయెను. కొన్నిసందర్భముల నిజస్థితిని మీవల్లతెలసికొనవలెనని నాకు కుతూహలమున్నది. మీరు నిర్భీతిగ ఉన్నదున్నట్లు చెప్పవలెనుసుమండీ.

శ్రీధర:—అమ్మా! అబద్ధమెన్నటికిని చెప్పను. ఆ అభ్యాసమేచేయలేను. అయితే ఒక్కమాట. కొన్నివిషయములు బయలుపఱచుటకు నాకు ఇష్టములేకపోయినయెడల మీరు క్షమింతురుగాక.

లీల:— శాస్త్రీ! ఎట్టివిషయమైనను నాతో చెప్పుటకు మీరు సంశయింపకుడు. కొన్నికార్యముల నిర్వహించుటయందు పురుషులకన్న స్త్రీలకే ఎక్కువ కౌశల్యముగలిగియుండుట మీరు ఎఱుంగని మాటగాదు.

శ్రీధర:— అమ్మా! చిత్తము.

లీల:— శాస్త్రిలవారూ! మీరెందుకు గుమాస్తాపనినుండి తొలగింపబడినది. మీరెన్ని కష్టములు పడుచుండునది, మీమంచిగుణము, నాకు తెలిసియేయున్నది. ఒక్కముఖ్యమైన కార్యమునకే మిమ్ములనే పిలిపించితిని. రాయనివారు కోర్టుకుపోయియున్నారు. మీరు నిర్భీతిగ కొన్ని సంగతులు నాతో మాటాడవలయును.

శ్రీధర:— అమ్మగారూ! నాయందు మీకుగల విశ్వాసమునకు, సదభిప్రాయమునకు నేను మిక్కిలి కృతజ్ఞుడ.

లీల:— (కొంచెమాలోచనచేసి) శాస్త్రులవారూ! ఇప్పుడు మీకు వేతనమెంత? క్షేమముగ......కాలమును గడుపుచున్నారా?

శ్రీధర:— అమ్మా! ఆరోగ్యముగనున్నాను. నాకేమియు కొఱత లేదు. వీరణ్ణశెట్టిగారు మాసమునకు ఇరువది రూప్యములనిచ్చుచున్నారు. దానితో ఒక్కపూట తృప్తికరమగు భోజనమును ఈశ్వరుడొసగుచున్నాడు.

లీల:— (స్వగతముగా) అయ్యో యెంతకష్టపడుచున్నదో!

శ్రీధర:— అమ్మా! ఏలదుఃఖించెదరు? నాకెట్టి లోపమును కలుగము. మీరెరుగరా? ఒక్కపూట భోజనమేచిక్కక పరితపించు సోదర సోదరీమణులు లక్షలకొలదియున్నారే ఈదేశములో.

లీల:— శాస్త్రులవారూ! అదిజ్ఞాపకమునకువచ్చియే దుఃఖించితిని. ఈయోచన నాకు పలుమారుగలుగుచుండును. కలిగినప్పుడంతయు నాకు దుఃఖమగుచుండును. లెక్కలేని జనులు కూటికిలేక వస్త్రములేక అన్నమో రామచంద్రాయని సంకటపడుచుండుట తలచినప్పుడు మనము సుఖించుటయే గొప్పపాపమనితోచును. సంపద పాపహేతువనుట నిక్కమని తోచుచుండును. దైవసృష్టిలో ఇట్టి హెచ్చుతగ్గులేల కలుగవలయును? అర్థమేకాదు.

శ్రీధర:— అమ్మా! మిమ్ములను దైవము రక్షించుగాంత. మన పరిష్కృతసమాజపు దుష్టసంప్రదాయములు సవరణకాని, సంహారణగాని చెందువరకు నాయట్టివారు ఈహెచ్చుతగ్గులు పరమాత్ముని లీలయనియే భావించి తృప్తిచెందవలయును.

లీల:— శాస్త్రులవారూ! ఈవేదాంతమువలన నామనస్సునకు సమాధానము కలుగదు. ఒక్కొక్కతూరి వేదాంతము సహితము మనసును భ్రమింపచేయు మిథ్యయనియే తోచును. వేదాంతమువలన వ్యావహారిక దుఃఖోపశమనము కలుగుననునది కల్ల. జగద్రక్షకుడు కేవలము కుత్సితగుణప్రధానుడని మనస్సునకు ఒక్కొక్కతూరి శంకకలిగియే తీరును......

శ్రీధర:— అమ్మా! అమ్మా!! ఇదిసరియైన అభిప్రాయముగాదు. పరమాత్ముని ఉద్దేశమును కనిపెట్టుటకు మనకు సాధ్యమా?

లీల:— ఉద్దేశము తెల్లముగానేయున్నది. దుష్టులకు ద్రవ్యమిచ్చుట, శిష్టులను శిక్ష చేయుట; అబద్ధమాడువారి కైశ్వర్యమిచ్చుట, న్యాయప్రవర్తకులను దారిద్ర్యపునూతిలో పడవైచుట; వంచకులకు వైభవములనిచ్చుట, మంచివారలను కష్టములోముంచివేయుట. అందరికిని తెలిసిన విషయమే!

శ్రీధర:— అమ్మా!

"పరిత్రాణాయ సాధూనాం
వినాశాయ చదుష్కృతాం,
ధర్మసంస్థాపనార్థాయ,
సంభవామియుగేయుగే."

ఇది మీకు తెలిసిన గీతావాక్యమేగదా.

లీల:— తెలియునుగాని, ఇట్టివిజరుగుట యుగమునకొక్కతూరి. అదియుగాక, ఏదుష్టులను పరిమార్చినాడు? కొంచెము లెక్కవేయుడు. హిరణ్యాక్ష, హిరణ్యకశిపులు దుర్మార్గులా? దుష్టపరిపాలనము చేయుచుండిరా? బలిచక్రవర్తి అధార్మికుడా? రావణుడు దుష్టుడా? చక్కగవిచారింపుడు. తన్ను తిరస్కరించినవారిని, తనభార్యను, బంధుమిత్రులను బాధించినవారిని, సంహరించుటకు సంభవించియుండెనుగాని, ఇప్పటికాలములో అవతరించుటకు అవకాశమేలేదు. ఎందుకనగ, దుర్మార్గులందరు దేవునకు టెంకాయలు కొట్టుచు లంచమిచ్చుచునే యుందురు. ఇది ఇట్లుండనిండు. మీతల్లిగారికి అనారోగ్యమని వింటిని, ఎట్లున్నది?

శ్రీధర:— బాగుగలేదమ్మా! త్వరలో ఈశ్వరుని పాదారవిందములచేరునేమొ?

లీల:— ఎంతకష్టము? అయిన తార ప్రసవమునకు ఎట్టి ఏర్పాట్లు చేయుదురు?

శ్రీధర:— అమ్మా! నాకేమియుతోచదు. సముద్రమధ్యమున చిక్కినట్లున్నాను. కరుణాసముద్రుడే నను గాపాడునుగాక.

లీల:— అయ్యా! నీధైర్యము మిక్కిలి శ్లాఘనీయము. నీయట్టిధైర్యము నాకును గలుగుగాక. తార ఎప్పుడైనను నన్ను తలచుచుండునా?

శ్రీధర:— అనవరతము తమతల్లినిబోలె మిమ్ముల స్మరించుచునే యుండును.

లీల:— మరియొక విషయము.

శ్రీధర:— సెలవిండు.

లీల:— (కొంచము నిదానించి) మా రాజా మీయింటికి పదేపదే వచ్చుచుండు మాటనిజమేనా?

శ్రీధర:— నిజము.

లీల:— మా రాజా, తారతో సంభాషించునా?

శ్రీధర:— అందేమితప్పు?

లీల:— తప్పనకుగాదు. తల్లిహృదయము......మీకు తెలియని విషయముగాదు కొన్నివార్తలు విని నేను దిగులొందితిని. నిజమరయుటకై మిమ్ముల పిలపించితిని. ఈవిషయము నేనడుగక ముందే మీరూహించియుందురని నేనమ్మితిని. నిర్భయముగ వాస్తవమును వచింపుడు.

శ్రీధర:— అమ్మా! కొన్నిఅంశములను నేను నుడువనని తొలుతనే మీతో చెప్పియుంటిని. కావున ఈప్రస్తావము ఇంతటితో వదలిపెట్టుడు.

లీల:— అయ్యా! నాతోనొక్కటియు దాచకుడు. నాకుమారునియందు నాకెట్టివాత్సల్యముగలదో తారయందుగూడ అట్టివాత్సల్యమేకలదని సప్రమాణముగవచింతును. నిజముపలుకుడు. ఎంతనొప్పిగలిగినను న్యాయమునకు తోడ్పడుదునుగాని, న్యాయవిరుద్ధముగ ప్రవర్తింపను.

శ్రీధర:— అమ్మా! సంతసించితి. ఒక్కప్రశ్న అడిగెదను. మీరు పునర్వివాహమునకు సమ్మతించెదరా?

లీల:— (మిక్కిలియోచించి) శాస్త్రిలవారూ! ఇట్టిప్రశ్నకు పండితులు ప్రత్యుత్తరమియ్యవలయును. స్త్రీలకు ఇట్టిప్రశ్నలకు సమాధానము చెప్పుటకు అధికారముగలదా?

శ్రీధర:— అమ్మా! నన్ను క్షమింపుము. మీరిట్లు తలచుటయే మన సమాజపు దౌర్బల్యమునకు కారణము. సమాజమందు తాను తక్కువతరగతిలో యున్నానని స్త్రీ, నిర్వివాదముగ ఒప్పుకొను లోపమును పురుషుడు తన దౌష్ట్యముకొరకు ఉపయోగము చేయుచున్నాడు. మీయట్టివారు ఈవ్యర్థభావమును భంజించి, మన సమాజమును సంస్కరించి ఉద్ధరించుటకు నుద్యమించుకార్యము అత్యావశ్యకముగదా?

లీల— (నగుచు) శాస్త్రులవారూ! నాకేమి పాండిత్యముగలదా? ఇంగ్లీషు నేర్చితినా? సభలయందు నుపన్యసించగలనా? నానుండి సమాజమునకు ఎట్టిలాభముగలదు?

శ్రీధర:— అమ్మా! పాండిత్యమేల కావలయును? ఇంగ్లీషుచదువేల కావలయును? నాకును ఆంగ్లేయవిద్య శూన్యమే! ఈదేశమున పూర్వము ప్రసిద్ధిజెందిన హిందూస్త్రీలందరు ఆంగ్లేయవిద్య నేర్చియుండిరా? అనాదిగావచ్చిన ఆర్యసంస్కృతివలన సమాజము వృద్ధినొంది బలపడునేగాని, ఆంగ్లేయవిద్య ముఖ్యముగాదు. స్వచ్ఛమైన సనాతనధర్మమున మెలగి, పవిత్రమైన భారత పతివ్రతా శిరోమణుల అనుగ్రహము కలిగిన మీయట్టివారే హిందూసమాజమునకు వన్నెపెట్టవలసినవారు. నాలుగు యెంగిలి ఇంగ్లీషు ముక్కలుజదివి 'స్త్రీస్వాతంత్ర్య'మను నెపమున ఔచిత్యములేని, వెఱ్ఱివర్తనలచే వ్యవహరించుచుండు ఈనాటి ఇంగ్లీషునేర్చిన యువతులవలన సమాజమునకు సంకటములు కలుగుననియేగాని సుఖములు గలుగవని నాయభిప్రాయము. నన్ను మన్నింపుడు. మనసమాజవృక్షము చిగురించి, పుష్పించవలెనన్న మీబోటివారికి సాధ్యముగాని, ఇతరులకుగాదు.

లీల:— శాస్త్రులవారూ! మీరు నాయందు ఎక్కువగౌరవముకలిగి యుండినందులకై కృతజ్ఞురాలను. ఒక్కవేళ విధవా వివాహము నామనసునకు విరుద్ధముగాదని భావింపుడు. మీరేల అట్టిప్రశ్న లడిగితిరి? మీరు తారను వివాహము చేసికొనవలెనని యున్నారా?

శ్రీధర:— రామ! రామ!! నేనట్టి క్రూరకృత్యము చేయుదునా? నవ యౌవనకళాప్రౌఢయగు ఆసాధ్వీమణిని చేపట్టుభాగ్యమునకు నేనెన్నటికైనను అర్హుడగుదునా? అమ్మా! పరమేశ్వరుని సాన్నిధ్యమున పల్కెదను. తార నాబిడ్డసమానము.

లీల:— మఱియేల విధవావివాహపుప్రశ్న?

శ్రీధర:— అమ్మా! తారనుభరించుబాధ్యత, తారను హరించినవారలకేకదా? అట్టివానికే తారనిచ్చి వివాహముఁచేయుట యుక్తముగదా?

లీల:— నిజమేకాని, శాస్త్రులవారూ! తారపతి యెవ్వరని కనిపెట్టితిరా? నేనేఅడుగవలయునన్న నాకించుక సంకోచముకలిగియుండెను. అతడు తారను వివాహమాడుటకు సమ్మతించునా?

శ్రీధర:— అమ్మా! దీనికి నీసాహాయ్యముగావలసినది.

లీల:— (ఇంచుక యోచించి) ఎవడాతారాపతి?

శ్రీధర:— అమ్మా! తారాపతి చంద్రుడే!

లీల:— మీమాటలు నాకర్థముగాలేదు.

శ్రీధర:— (తలవంచి) చంద్రునకు వేరొక్కనామము రాజు.

లీల:— (దిగ్భ్రమజెంది) నిజమా?

(లోపలనుంచి భీమసేనరావుగారు కచ్చేరినుంచి వాపసువచ్చి లోపలమాట్లాడినట్లు ధ్వని వినబడును.)

లీల:— (ఆతురతతో) శ్రీధరశాస్త్రి! నాయజమానులవారు త్వరలోనేవచ్చిరి. నాకేమియు తోచకున్నది. మీరు వెడలిపొండు. ఈసమయమున దైవము నాకు ధైర్యమునిచ్చుగాకయని ప్రార్థింతును.

(శ్రీధరుడు వెళ్ళును,)

(భీమసేనరావుగారి ప్రవేశము.)

భీమ:— లీలా! ఆదుర్మార్గుడేల ఇచ్చటికి వచ్చియుండెను?

లీల:— శ్రీధరశాస్త్రి ఏలదుర్మార్గుడు?

భీమ:__ పరమదుర్మార్గుడు. సమాజకంటకుడు. జాతిభ్రష్టుడు. బ్రిహ్మద్వేషి. తారకు దుర్బుద్ధులు కరపి భ్రష్టగాచేసిన పరమ నీచుడు.

లీల:__ తార ఏమితప్పుచేసెను?

భీమ:__ అయ్యో! నీకేమి మతిపోయినదా? అంతకంటే తప్పుగలదా! కులభ్రష్టతయే!! బ్రహ్మకుల యశశ్చంద్రికలను సంపూర్తిగ మాపివేయు మహాపాపమే!!!

లీల:__ భ్రూణహత్యమాత్రము మహాపాతకములలో చేరదా? పోనిండు. తారచేసినది పాపమేయనుకొందము. మనకు దయవలదా?

భీమ:__ దయ! దాక్షిణ్యము!! అది శ్రీసర్వేశ్వరునిసొత్తు......... కరుణాధాముడగు రామునిహక్కు. దయచూపుటకు మనకు అధికారముగలదా?

లీల:__ అటులనే శిక్షణకూడ పరమేశ్వరుని హక్కుగదా? శిక్షించుటకుమాత్రము మనకధికారముగలదా?

భీమ:__ ఓహో! ఏమితర్కవాదములోనికి దిగితివే! అవివేకీ! చెప్పెదను వినుము. శిక్షావిధులు లేకపోయిన, సమాజమున పాపము ప్రబలి, జనులు భీతిలేక దుష్టకార్యములను చేయుటకు ప్రారంభింతురు. పాపకార్యమును నిరోధించుటకై జనుల మనసున భయముపుట్టింపవలయునని శిక్షాస్మృతి ఏర్పడినది.

లీల:__ పోనిండు. ఒకానొకప్పుడు ప్రకృతిసహజమగు సుదేకముచే మైమఱచి చేయుకార్యముకూడ పాపమేనా?

భీమ: _ ఊః పాపమే! లీలా! నీప్రశ్నలు నాకర్థమగుటలేదు. ఇప్పుడీపాపవిమర్శ లెందుకు?

లీల:__ ఏమియులేదు. తారవిషయమై మీరు పాపమొనరించినదని నుడివితిరి. దానిపై నాకొకసందేహము గలిగినది తారను బుజ్జగించి లోచేసికొన్నవారు పాపమొనర్చిరా? లేక ఒడలెరుగక లోబడిన తారపాప మొనర్చెనా? అని.

భీమ:— లీలావతీ! నీవు పొరపడుచున్నావు. మన ధర్మశాస్త్రము లలో కట్టుబాట్లు నీవెరుగవు. జగదీశ్వరుడును, ఋషిశ్రేష్ఠులు ను, విధవలకు కొన్ని నిబంధనలేర్పరచియున్నారు. విశేషదృష్టి తో చూచినయెడల జగత్కర్తయొక్కడే నిజమైనభర్త. సృష్టి యంతయు అతనికిభార్యలే. కావున స్త్రీ భర్తగతించిన పిదప వేరొకభర్తను వివాహమాడిన దైవద్రోహ మొనర్చినట్లు అగును. జగత్కర్తకు పోటీపెట్టినట్లగును.

లీల:— అయిన భార్యగతించిన పిదప, భర్త.........

భీమ:— మరల వివాహముచేసికొనవచ్చును. చెప్పలేదా-ఒక జగత్కర్తకెందరో భార్యలని!

లీల:— బాగుగనున్నది! అయిన మీయభిప్రాయము పురుషుడు సృష్టికర్తయనియా?

భీమ:— కేవలము తత్స్వరూపము.

లీల:— అయిన తారను మోసగించిన పురుషునికి దోషమేలేదా?

భీమ:— లీలావతీ! నీకు ఈసమాచారములు బోధపడవు. నేను చెప్పితినిగదా, వితంతువుల విషయమై ఋషిప్రోక్తములగు నిబంధనలేర్పడియున్నవని. హిందూసమాజ సౌధమునకు విధ్యుక్తరీతిని ప్రవర్తించు విధవలే అలంకారప్రాయులు. విధవలనీతి చెడెనా, హిందూసమాజ సౌధము ఒక్కపెట్టునకూలి హిందూమతమే నిర్నామమగును.

లీల:— బాగుగనున్నది!

భీమ:— అదియుగాక, పురుషుడు సృష్టికే యజమానుడు. తాను చేసిన కార్యమును మరుగుపరచుకొనగలడు. సమాజపు నేమములను రక్షించగలడు.

లీల:— అయిన, దోషములు రహస్యములుగనుండువరకు సమాజమునకు క్షేమమేగదా!

భీమ:— నిస్సందేహముగా.

లీల:— సమాజమునకు మరుగైన, సర్వేశ్వరునికికూడ మరుగేనా?

భీమ:— అయ్యో! నీవెట్టి అజ్ఞానురాలవు. ఆచార్యులవారు బోధించు భగవద్గీతను నీకు వినుటకు అధికారములేదుగాని వినియుండిన నీవు గ్రహించుచుంటివి. మానవుడు మాధవునిచేతిబొమ్మ. ఆయన యెట్లాడించునో అట్లే ఆడుచుండవలయునుగాని కర్తృత్వము మాకెన్నటికైననుగలదా? కర్తృత్వము లేనప్పుడు మమ్ము పాపమెట్లు బాధించును.

లీల:— అయిన మగువలకుమాత్రము కర్తృత్వముగలదో? వారు చేయు కార్యములుగూడ దైవప్రేరితములే. వారినిమాత్రము పాపమెట్లు బాధించును?

భీమ:— (తలగోకికొనుచు) అధికప్రసంగివి. ఆచార్యులవారు దీనికితగిన సమాధానము చెప్పుదురు. నాకు కొంచెము కాఫీ తీసికొనిరమ్ము.

లీల:— నేడేల ఇంతశీఘ్రముగ వచ్చితిరి?

భీమ:— వచ్చినదే మంచిదాయెను. లీలా! నీవు శ్రీధరుని ఇచ్చటికి రానివ్వకుము. జనులు నన్నేమనుకొందురు. తారకు లోలోపల నేను సహాయముచేయుచున్నానని శంకింపరా?

లీల:—......చూడండి. ఇదవరకెన్నడును మిమ్ములను ఏవిషయమందైనను ప్రార్థింపలేదు. భూషణముల నడుగనైతిని. నాకొఱకై ఏమియు నడుగను. మీకుసలహాచెప్పుటకు నేను శక్తురాలనుగాను. అయిన ఒక్కటిమాత్రము నేను చెప్పవలయునని ధైర్యముచేసితిని. క్షమింపుడు. తారను రక్షింపవలసిన భారము మీది.

భీమ:— లీలా! లీలా!! నీకేమి పిచ్చిపట్టినదా? మతిపోయినదా?

లీల: — మతిగలిగియే మాటలాడుచున్నాను. మీకుఅంతయు తెలియును. (ధైర్యముతో) తారను నిక్కముగ మీకోడలనియే భావింపవలయును. భావించి వివాహముచేసియే తీరవలయును.

భీమ:— ఏమీ......?

లీల:— యోచింపుడు. చక్కగ యోచింపుడు. సమాజపుభీతిచే న్యాయమార్గమును తప్పకుడు. పాండవధీరుడగు భీమసేనుడు భీతి యనునది కలయాండ్రైనను ఎరుగడు. నాభర్త సార్థకనామధేయుడైనప్పుడుగదా నాకు సంతోషము గలుగును! తార విషయము, మనరాజావిషయము, మీకిదివఱకే తెలిసియుండవచ్చును. తప్పుచేసినవాడు నీకుమారుడేగదా! వానితండ్రియగు మీరు, ఆతప్పుకై అమాయకురాలగు మేనకోడలిని చిత్రవిధగా శిక్షించుటకన్న, ఆతప్పులోని పొరబాటును తొలగించి, తప్పును ఒప్పుగమార్చుట శ్రేష్ఠతమముకదా! నరకద్వారము నుండి మరలించి తమకు పుణ్యఫలము సమకూర్చుననికదా పుత్రుని బడయుట. అట్టివానిని మీరే నరకమున బడద్రోయ జూచెదరా? దయయుంచి తారమూలకముగా రాజును తరింపజేయుడు. చిత్రహింసావహమైన పరిష్కృత సమాజపు కట్టుబాట్లను తెగ్రెంపివైచి, కీర్తి నిగనుడు. అదియే ధీరపురుష లక్షణము. ఇంతకన్న నేనెక్కువ చెప్పజాలను. (అని నిష్క్రమించును.)

(భీమసేనరావు పచారు చేయుచుండును. విద్యాలంకారాచార్యులు ప్రవేశింతురు భీమసేనరావు నమస్కరించును.

ఆచార్యులవారు ఆశీర్వాదముచేసి, కుర్చీలో కూర్చొని ఒకచిటికపొడుము వేయుదురు.)

భీమ:— ఆచార్యులవారూ! సకాలమునకు వచ్చితిరి. అనుకొనినంత పనిజరిగినది. రాజావివాహప్రయత్నములో యున్నట్టున్నది. నాభార్య వానిపక్షమవలంబించినది. ఏమిచేయవలెను?

విద్యా:—ఆతురతపడకండి. లీలావతిదేవిగారికి ధర్మశాస్త్ర శ్రవణము గావించెదను. కొంచెము జ్ఞానముకావలెను.

భీమ:— నిష్ప్రయోజనమండీ! మీమాట వినదు. వివాహము కావింపుమని నాకే బుద్ధిచెప్పిపోయెను. మీమాటవినదు. నామాటవినదు.

విద్యా:— నారాయణ! నారాయణ!! మగువలు మతాచార్యుల వారి మాటలు పాటింపకపోయిన, మాభరతఖండపు గతియే మి గావలయును?

భీమ:— ఆచార్యులవారూ! నాబుద్ధి చెడిపోయినది. కులనాశన మగుకాలము సమీపించినది. అయ్యో! ఎట్టి ఇంటితనము! ఎట్టి ఆభిజాత్యము! ఎట్టివంశము! ఎట్టిశీలము! నాకుమారుడే విధవను పెండ్లిచేసికొనుటకు ముందు నాకు చావురాకున్నదే!

విద్యా:—(మజిల పొడుమువేసి) రావుజీ! దుఃఖపడకండి. 'ధైర్యం సర్వత్రసాధనం' అన్నారు. నేనంతయు చక్కపెట్టెదను. నాకొక్కయుక్తి తోచుచున్నది. ఒక్కచిన్నబొంకు బొంకిన చాలును. ఇది యెంతటిపని. శ్రీధరుడే లేకుండిన తార ఎక్కడిది? అప్పుడు వివాహమెక్కడ జరుగును? శ్రీధరుడే బహిష్కృతుడైన ......? ఇచ్చటినుండి వానిని తొలగింపవలయును.

భీమ:— నాకే మోదిగులగుచున్నది. మీరెట్లీకార్యము సమకూర్చెదరు?

విద్యా:— తొందరపడకండి. కొంచెము కల్పనాశక్తి........., కించిత్తు అబద్ధము........; ఏమిచేయవలెను? ఈగతి, ఇట్టి చిక్కు, ధర్మరాజుకే కలిగెను. విన్నారాలేదా! "అశ్వత్థామా హతః...' అదియుగాక-

> "వారిజాక్షులందు, వైవాహికములందు
> ప్రాణ విత్తమాన భంగమందు,
> జకితగోకులాగ్ర జన్మ రక్షణమందు
> బొంకవచ్చు నఘముబొందదధిప!"

ఇది మహాభారతమయ్యా! పంచమవేదము. వ్యాసులవారిది. ఇది ఇట్లుండనిండు. వీరణ్ణశెట్టిగారింట చంద్రహారము చోరీవిషయము విన్నారా లేదా?

భీమ:— వింటిని.

విద్యా:— పోలీసువారు శెట్టిగారి నౌకర్లయిండ్లను, గుమాస్తాల ఇండ్లను సోదాచేయవలెననియున్నారట.

భీమ:— (ఆలోచించి) కద్దా! శ్రీధరుడు ఎన్నటికైనను చోరకృత్య మునుచేయునా? న్యాయపరివర్తనుడే!

విద్యా:— రావుజీ! న్యాయపరివర్తకత్వము సన్మార్గమే? ద్రవ్యా ర్జన సులభమగువఱకు దుర్మార్గమును త్రొక్కనేరాదు. ఇది విశేషసీతి. (అనినవ్వును) మీరు యోచింపకుడు. నేనంతయు సవరించెదను. విధవావివాహమును నిరోధించుటకై వేయి బొంకులుబొంకినను పాపములేదు. ఒక్కమాట-ఆ-మీనౌకరు యల్లప్పను నమ్మవచ్చునా?

భీమ:— మంచినమ్మకస్థుడు. ఏల?

విద్యా:— ప్రకృతము మీకుచెప్పుట కవకాశములేదు. మీరులో నికివెళ్ళి యల్లప్పను ఇచ్చటికి పంపుడు.

(భీమసేనరావు లోనికివెళ్ళును.)

(యల్లప్ప ప్రవేశము.)

విద్యా:— యల్లప్పా! నీసమాచారమునుగూర్చి పంచాంగము చూ చితిని. గోచారరీత్యా నీకిప్పుడు గ్రహములు బాగుగలేదు.

యల్లప్ప:— స్వామి! స్వామీ!! నన్ను కాపాడేభారము మీది.

విద్యా:— భయపడకుము. నీగ్రహములు మిక్కిలి వక్రించినవి. నీవు నేను చెప్పినట్లుచేయకపోయిన నీకు త్వరలోనే కారాగృ హ ప్రాప్తికలుగును.

యల్లప్ప:— అయ్యో స్వామీ! (అని పాదములపై పడును.)

విద్యా:— లెమ్ము. భయపడకుము. నేనుచెప్పినట్లుచేసిన నీపీడ ప రులపాలగును. నేనొక రక్షను మంత్రించి ఇచ్చెదను. దానిని నీవు తీసికొనిపోయి నేనుచెప్పినచోట పడవేయవలెను. ఎవ్వ రికిని తెలియకుండ. (అని చెవిలో ఏమియోచెప్పిపంపును.)

యవనికపడును.

---

# సరిపడనిసంగతులు.

## రెండవయంకము–నాల్గవరంగము.

స్థలము–వీథి.

కాలము-ఉదయము సుమారు 8 ఘంటలు. లోనుండి

"దారిద్ర్యదుఃఖేనకగోతిపాపం"

అని భీమసేనరావుధ్వని వినబడును.

(భీమసేనరావుగారును, ఆచార్యులవారును ప్రవేశింతురు.)

Head-Constable. మధురపిళ్ళైవచ్చి-

మధుర:— ఎంతపనియుండిన సమాళించుకొని స్టేషన్‌కు జరూరుగా పిల్చుకొనిరమ్మన్నారు ఇన్‌స్పెక్టరుగారు.

వకీలు:— అవునయ్యా! వీరణ్ణశెట్టి నాకక్షిదారుడే. వారింటిలో చోరీ అయినది నాకు ఆశ్చర్యకరముగానున్నది. కాని, శెట్టిగారి కుమారునకు చంద్రహారముచోరీకి సంబంధమేమయ్యా? ఈ క్రొత్తసిస్టం ఇన్‌స్పెక్టర్లదంతా (అని దగ్గి) ఒకమోస్తరు. కన్న మొకచోట. వీర్లపరీక్ష మరియొక్కచోట.

మధుర:— నాకు తెలువదు స్వామి! వెళ్ళిగాలమేలేచి చెట్టిగారు మనయింటికాడ వచ్చింది. ఇన్‌స్పెక్టరుగారు మిమ్ములను అడుగాలెయని.........

వకీలు:— ఎవరుచెప్పినది? సర్వాబద్ధము. నేను అప్పుడే చెప్పితినే దొంగ ఒక్కచోట మీరు వెదికేది ఒక్కచోట అని.

మధుర:—మాది ఏం ఉండాదిస్వామి? నాకాలమంత అయిపోయిండాది. ఇంకొక్క వచ్చరం అయిపోయిండాదంటె పించిన్‌వస్తాది.

విద్యా:— పిళ్ళైగారు ఏమాత్రిం గంటుకట్టిండారో?

మధుర:— ఎక్కడుండాది స్వామి ఈకాలములో? ఇప్పుడుండే పెద్దోళ్ళకే సాలేల్లేదు; నాకెక్కడస్వామి. దొర్లుకూడ అట్లాటివాళ్లే వస్తారు. మాకు పెరియ కేసులేలేవు స్వామి.

వకీలు:— ఇది పెద్దకేసుకాదా? రాజా వీరణ్ణశెట్టిగారి ఖజానాపెట్టె నుంచి చంద్రహారము పోవడమంటే ఏమి? వేసినబీగం వేసినట్టే యున్నదికదా?

మధుర:__ అద్దాస్వామీ! చేనా ఆచ్చర్యముగా ఉండాది. ఇంటివాడుదా దొంగఅని నేనుతలుస్తాను.

వకీలు:__ బుద్ధి ఎక్కడ ఉన్నదయ్యా నీఇన్‌స్పెక్టరుకు? ఇంటిదొంగేనిజము. అయితే ఎప్పుడీపని చేసియుండునని కొంచెమాలోచించవలెను. ఆయాలోచనభాగమే మీయిన్‌స్పెక్టరుకు సున్న.

మధుర:__ గుంస్తా చేసిండాడని నాబుద్ధి. మాఇన్‌స్పెక్టరుగారు చిన్‌శెట్టిపైన గుమానీ పెట్టిండాడు.

వకీలు:__ పాతకాలపు హెడ్‌కానిస్టేబిల్ అయ్యానీవు! ఈకొత్త ఇన్‌స్పెక్టర్లకు కేసుపత్తాచేసే పద్ధతులేమి తెలియును?

మధుర:__ నీబుద్ధికిదా ఏంతెలుస్తుంది సామీ?

భీమ:__ "దారిద్ర్యదుఃఖేన కరోతిపాపం." ఆచార్యులవారూ! ఏమంటారు? (వకీలు, ఆచార్యులు గుసగుసలాడుదురు)

మధుర: —ఏంసామి! కొత్తగుంస్తానుపత్తిగాదే మీరు మాట్లాడుతూవుండేది, శ్రీధరశాస్త్రి.........

(వకీలు ఆచార్యులవారిచెవిలో ఏమియోచెప్పను.)

మధుర:__ సరిదాసామి! నాకంత తెలసిదా ఉండాది. నీనౌకరి ఎందుకుస్వామి విడిచిందివారు?

వకీలు:__ ఏమో పాపం జీతం చాలక.

మధుర:__ ఇప్పుడు శెట్టిగారివద్ద తక్కువ జీతానికిదా వచ్చిండారే?

భీమ:__.........

విద్యా:— పిళ్ళెగారూ! వకీలుగారికి ధర్మగుణం; గొప్పమనస్సు; వారు ఒక్కరికిచెడుపుచేసేవారుగారు. నేను చెప్పేదను వినండి. కక్షిదార్లు స్టాంపుకు అని, కాపీలకని దుడ్డుఇచ్చుచుందురు గదా! లెక్కలువ్రాసేది గుమాస్తాగారే. ఇట్లనేయుంటుంది గదా......దారిద్ర్యము...... ఆశ......సమయము.......
నేను మీకు చెప్పవలయునా? కొన్నిరోజులకు బయటబడెను. అప్పుడు పనిలోనుంచి తొలగింపవలసినదాయెను గనుక

మధుర:— జోస్యర్ చెప్పింది రొంబసరి. ఇప్పుడుదా నా కేసు పళపళయని పత్తా అయిపూయిడ్సింది. స్టేషన్‌కుపూడ్సి ఇన్‌స్పెక్టర్కు సొల్లిడుస్తాను.

భీమ:— అది అన్యాయము. మిక్కిలి అన్యాయము. ఆచార్యుల వారూ! ఎంతపనిచేసి పెట్టితిరండి!! నా కెంత యశపకీర్తి తెచ్చిపెట్టితిరండీ!

మధుర:— సామీ! అయ్యర్‌ను తిట్టవద్దండి. అయ్యర్ నింజాబుద్ధి. వీరుదా క్రిమినల్ డిపార్టుమెంట్‌లో వుండాలె. అప్పుడుదా డిటెక్షన్ సూడండి! జిలిజిలియని యుండును......

భీమ:— (మధురపిళ్ళైను కొంచెము ప్రక్కకు తీసికొనిపోయి) హెడ్‌కాన్‌స్టేబిల్ గారూ! ఏదో ప్రమాదము జరిగినది. చెప్ప కూడనిసంగతి మాఆచార్యులు చెప్పివేసిరి. అయితే రెండు విషయములు మాత్రము మీరు నాకు సహాయము చేయవలయును. ఇన్‌ఫర్మేషన్ నానుంచి వచ్చిందని మీడైరీలో ఎక్కించకండి. రెండవది ఇది తప్పక చేయవలెనుసుమండి-ఇక రెండుఘంటలు మాత్రము శ్రీధరునిఇంటికి ఝుడ్తిచేయుటకు పోవద్దండి.

మధుర:— ఎందుకు? మాల్ పరారి అయితే......

భీమ:— శ్రీధరుని ముసలితల్లి తెల్లవారుజామున మరణముచెందినది. ఇప్పుడే శవమునుసాగించు ప్రయత్నములోనుండును. పాపము. దుఃఖసమయము. ఇంచుకనిదానించి శవసంస్కారకార్యములు ముగిసినపిదప మీపనిచేయుడు. అంతవరకు మాలుపరారిచేయకుండ నేను జవాబుదారి, కాపుదారి. ఏదోకష్టకాలము. నాకు ఎంత మోసముచేసియుండినను కష్టకాలములో ఏదైనను ఆయనకు సహాయముచేయవలయునని అచ్చటికి పోవుచుంటిని. ఇంతలో మీరు స్టేషన్‌కురమ్మని పిలిచితిరి.

మధుర:— సార్, మీరుస్టేషన్‌కు వచ్చేపనిఏముండ్? ఇప్పుడు కేసుదా తెలసిపోయిడ్సిందే! నేనుఇన్‌స్పెక్టరుకుపోయి సెప్పిడుస్తాన్.

భీను:— మంచిపని. నాకు మీరుమంచి సహాయముచేసినట్లాయెను. నేను తత్క్షణమే శ్రీధరుని ఇంటికిపోయి నన్ను దూషించినను మెడపట్టినూకినను నేను అతనికి సహాయమెునర్తును.

మధుర:— సార్, నేనెంతమంది వకీళ్ళనో సూసిండాను. నిమ్మవోలె నెల్లగుణం యాఁరికిలేదు. నేపోయిదుస్తునా?

విద్యా:— పిళ్ళెగారూ! వారేమో నెల్లగుణం. నేనుకొంచెము దుర్మార్గుడను. శవముసాగని, సాగకపోని. నాకించుక అనుమానం కలిగెనా నేను తత్క్షణమే మీకుచెప్పిపంపిస్తాను. మీరు ఋజుట్టీ చేయండి.

మధుర:— అడే అబ్బా? నీవుదా యముడుండానయ్యా. దాసక్ అండి. (అని వెడలిపోవును.)

(వాడు పోయినతరువాత విద్యాలంకారాచార్యులు ఒక్క చిటుకు పాడుముపీల్చి భీమసేనరావును చూచి)

"ఎట్లు"? జ్ఞానముండవలెనండీ జ్ఞానమూ!

(యవనికపడును).

---

# సరిపడని సంగతులు.

## రెండవయంకము-ఐదవరంగము.

కాలము-ఉదయము తొమ్మిది ఘంటలు.

శ్రీధరుని యిల్లు.

(తార, మధ్యరంగమున శవమును, ప్రక్కన గాంధీమహాత్ముని పటముపెట్టి పూజచేయుచు పాడుచుండును. శ్రీధరుడుకూర్చొని చింతించుచుండును. పాటముగిసిన పిదప శ్రీధరుని సమీపించి)

తార:— అయ్యో! మీరిట్లు చింతించుచుండిన ప్రయోజనమేమి? మీకు నేను చెప్పవలయునా? ప్రతిదినమును మృత్యుంజయుని ఆరాధించు మీకు నేను ధైర్యము నుపదేశించుటకు శక్తురాలనా? వేడుకరాట్నమువలె ఎడతెగక తిరుగుచుండు చావుపుట్టు

వులను నిరోధింప సాధ్యమా? మీరు తెలిసినవారు. అయ్యో! దుఃఖించుచున్నారే. నాకు చెప్పరాదా? ఎందులకట్లు సంకటపడుచున్నారు. కేవలము నశ్వరమగు తల్లిదేహము క్షీణించెనని మీరు ఇట్లు దుఃఖించుచున్నారా? నే నమ్మను. మీసంకటమునకు మఱియొక కారణమేదియో యుండవలెను. నాకు చెప్పగూడదా?

శ్రీధర:— చచ్చినవారికి కాదమ్మా, బ్రతికినవారి, బ్రతుకు తెరవుకొరకే నేను దుఃఖించుచున్నాను.

తార:— నాకొక్కటియు అర్థముకాదు. నాకొరకు దుఃఖించుచున్నారా?

శ్రీధర:— బిడ్డా! ఈతల్లి నన్నొకనినేకాదు. నిన్నుగూడ తనబిడ్డవలె పోషించుచుండెను. అట్టిప్రేమరాశిని మరల నీకెక్కడనుండి కొనితెత్తునమ్మా. ఇదియే నాదుఃఖకారణము. ముందు నీసేవ ఎవరుచేయుదురు. నీకాన్పునకెవరు సాయపడుదురు? దరిద్రుడనే! ఎవరినికొనితెత్తు? నీకష్టములమఱచి నాకు ముదముగూర్పుమాటలు చెప్పుచున్నావే! నేనెంతనిదుఃఖింతును? ఈశ్వరానుగ్రహమువలన నీకు సుఖప్రసవమయి నీకు నెమ్మదికలిగినపిదప నీవు నాసేవజేయనొప్పుదువుగాని, ఇప్పుడు నీహితము నకై' నేనేమిచేయజాలుదు?

తారా! ఆలోకరక్షకుడే నిన్ను, నన్ను, సర్వులను రక్షించువాడని నాకు తెలియును. ఆదృఢనమ్మకము నాకుగలదుకాని నీసౌఖ్యమునరయుట నాకర్తవ్యముగాదా? ఈచింతమాత్రము నన్ను బాధించుచున్నది. తల్లిమరణమునకు దుఃఖింపను. నీకాన్పుకై దుఃఖింపను. ప్రపంచమున బిడ్డలుకన్న తల్లులు ఎందరో నిను గాపాడుటకు సంసిద్ధులుగానుందురు. అయిన......

తార:— అయిననేమి? మీచింతకు గారణమేమి?

శ్రీధర:— (లేచి ఇటునటు తిరుగుచు) లేదు చింత. చింతకు కారణములేదు. అదియుగూడ లోకభర్తకుచెందినకార్యము. అతడే

నీకు మంచిభర్తనుగూర్చి సౌఖ్యముః గలుగజేయును. నీవుసుఖముగనుందువు.

తార:—(ఇంచుకదుఃఖము నభినయించి గద్గదస్వరముతో) మిమ్ము లనువిడచి నాకు సౌఖ్యమా? మీపాదసేవలేని సౌఖ్యము స్వర్గ సౌఖ్యమయినను నాకువలదు. అయ్యా! ఒకవేళ మీసేవచేయుటకు నేను యోగ్యురాలనుగానవియా......?

శ్రీధర:— అయ్యో! అయ్యో!! ఇటుతగునా? అట్టికల్మషము, అట్టికలత, నను చేరకుండుగాక! అమ్మా నీయట్టి సాధ్వీమణి సేవనొందుటకు నాకు పూర్వజన్మపు సుకృతముండవలెనమ్మా! నీవు! నీవు!! నీప్రాణము, నాసంపద, నాధైర్యము, నాశక్తి, నావైభవము, నాదీక్ష, తారా! నాస్వర్గమేనీవు. తారా! నీవు యౌవనవతియు......

తార:— ఏమట్లు ఊరకనిలచితిరి?

శ్రీధర:— తారా! యౌవనమిట్టిదియని......

తార:— (వేగముగ) యౌవనము మీపాదధూళిసమము. (సమీపించి హస్తమును స్పృశించును.)

శ్రీధర:—(కనువిచ్చి తారను చూచును.) తారా! నీవు యౌవన శృంగార వనదేవతవు. అయిన (కోపముతో) ఈప్రకృతపాప సమాజమున......

తార:—అయ్యా! ఇదియా సమయము సమాజపు దుస్థితులనువర్ణించుటకు? జరుగవలసినకార్యముల చూడవలదా?

శ్రీధర:— తారా! చచ్చినవారికి మార్గముచూపుట మనపనికాదు. బ్రదికినవారికి మార్గముచూపుటయే మనపని. చచ్చినవారి సౌఖ్యము చావులేనట్టి ఆదేవదేవుడే చూచికొనును. బ్రతికియున్నవారలసౌఖ్యము మనమించుక గమనించినచాలును. స్వర్గమునందు, కైలాసమునందు, వైకుంఠమునందు, ఆరోగ్యసంఘములకు పట్టణపారిశుద్ధ్య సంఘములకు, భోజనములకు, విందులకు, సౌఖ్యములకు, ఏమియు కొఱతలేదు. ఇచ్చటిప్రజాసౌ

ఖ్యముల మనముగాపాడుకొన్న జాలును. చచ్చినవారి శ్రాద్ధము నకంటె బ్రతికినవారి సౌఖ్యమునందు శ్రద్ధవహించుటయే నిజమైన ధర్మము.

తార:— అయ్యో! ఎండ ఎక్కుచున్నది. నేనేపోయి శెట్టిగారినడిగి సహాయముచేయమని......(అనుచుండగా)

లీలావతి ప్రవేశము.

(తార ఒక్కనిముసము ఆశ్చర్యము నభినయించి పిదప తటాలున లీలావతిపాదములపైపడును. శ్రీధరుడు ఏమియుతోచక నిలుచును. లీలావతి తారను లేవదీసి ఆలింగనముచేసి దుఃఖించును. తారఏడ్చుచు దూరమునకరిగి)

తార:— అమ్మా! నేనుపతితురాలను. నీపాదములంటుటకుకూడ యోగ్యతలేదేమో! (అని ఏడ్చుచుండ, శ్రీధరుడు తారను సమీపించును. లీలావతి తారను మరల కౌగలించికొని ముద్దిడి)

లీలా:— బిడ్డా! మాయందరికంటె నీవేపరిశుద్ధురాలవు. నీవేపాపము చేయలేదు. ఇప్పుడా ప్రశంసవలదు. జరుగవలసినకార్యము లున్నవి. ముసలితల్లి మరణమునొందిన విషయమునువిని తత్క్షణమే వచ్చితిని. ఇచ్చటి సందర్భములు నాకు తెలిసినవి. నీవుపడినబాధలన్నియు తెలిసికొన్నాను. ఇప్పుడు నిరాటంకముగ నీచెంత నిలిచి నిన్ను నాబిడ్డవలె పోషించుటకు సిద్ధురాలుగనున్నాను. అయిన అది ఇకముందుపని. ప్రస్తుత మీదేహమునకు సంస్కారము చేయవలెను.

తార:— అమ్మా! నాకొరకెంత సాహసముచేసితివి? నీకుకలుగబోవుహింస ఇంచుకైనను యోచనచేయకపోతివే? పొమ్ము. నిన్ను ప్రార్థించెదను. నీవింటికి పొమ్ము.

లీల:— తారా! స్త్రీలందరు దుర్బలులని తలచితివా? ఒక్కనాడైనను నైజమగు తమశక్తిని ఈమగపందలకు తెలియచేయ శక్తులుగాక పోవుదురా?

తార:— అమ్మా! నీకేల యిట్టిబుద్ధిపుట్టెను? నీవు సమాజమునకు గొప్పగనున్నావు. నీకు గౌరవముగలదు. వెలలేని పతిభక్తిచే వెలగుచుండు సతీమణివని నిన్ను సకలప్రపంచమును కొనియాడు చున్నది ధర్మపత్నియను బిరుదున కేహానికలుగునే!

లీల:— ధర్మములేనిపతియొక్క సతి, ధర్మపత్ని యెట్లగును? భర్తదగ్గర ధర్మమున్నగదా భార్యఆధర్మమును పరిపాలింప బ్రోడగును?

తార:— అమ్మా! దూరమాలోచింపుము. ఊరక ఏలకష్టములకు గురియయ్యెదవు? ఒకనాడు గృహమువిడిచి ఒంటరిగా వీధిని వెళ్లినదానవుగావు. భర్తను ధిక్కరించినపిదప నీగతిఏమగునో ఇంచుకయోచించుము. మగవారి సహాయములేక మగువలు ఈసంసారసాగరమును తరింపగలరా.

లీల:— తారా! నాకట్టిభయము లేదు. కష్టమెట్టిదో, దుఃఖము ఎట్టిదో, నిరాధారత్వమెట్టిదో పరీక్షించియే చూచెదగాక. నిరాధారత్వమా? ఈప్రపంచము, ఆకాశమధ్యమునపుట్టె చెండువలె తిరుగుచున్నదిసుమా! దీనికిఆధారమెద్ది? ప్రహ్లాదుడు తండ్రికి ఏమియుత్తరమిచ్చెను. జ్ఞాపకములేదా?

తార:— అమ్మా! నీవెంతచెప్పినను నామనసునకది యొప్పకున్నది. సమాజము నీకెన్ని పేర్లిడునో! ఎందరునిను!వేలుచూపి పరిహసింతురో! యోచించినకొల్ల నాకుకళవలముకలుగుచున్నది.

లీల:— తారా! సమాజము సమాజమనుచుంటివి. ఈసమాజపుకట్టుబాట్లనుచూచి తప్పకుండఅనుసరించి ఆచరించిన వారికిమాత్రము సమాజమేలాటి సహాయమునొనర్చినది? కష్టస్థితియందు ఎట్టిసహాయమయినను గలుగునా? ఈసమాజమునుంచి– "తెప్పలుగచెరువునిండిన గప్పలుపదివేలుగదరా సుమతీ" అనివినలేదా? అంతయే. భాగ్యవంతుల పీనుగనుచూచిరా, పరోపకారబుద్ధి భుజములపైనికే ఎక్కును. నిర్భాగ్యులపీనుగఅయినచో నాభార్య గర్భిణి......తల్లిదండ్రుల ఆయువు......కోటి శాస్త్రములుకూర్చి తప్పించికొందురు. ద్రవ్యమునకొక ధర్మశాస్త్రము. దారిద్ర్యమున కొకధర్మశాస్త్రము. ఇదియేగదా

ప్రకృతసమాజపునియమము! తారా! కాలముమీరుచున్నది. రమ్ము. నేనును, నీవును, శ్రీధరుడును, ముగ్గురమును ఈశవమును కొనిపోవుదము.

(అనుచు ఆశవముదగ్గరకుపోయి తలవంచికొని ప్రార్థనచేయుదానివలె కూర్చొనును.)

(ప్రవేశము-భీమసేనరావు-విద్యాలంకారాచార్యులు)

భీమ:— (లీలావతినిచూచి; నిశ్చేష్టితుడై, ఆగ్రహముతో) ఏమి!?

లీలా:— (తలయెత్తిచూచి, మెల్లగలేచి, స్టేజుముందరిభాగమునుచేరి, సైగచేసి, భీమసేనరావును వద్దకురమ్మని)

అరవకుము. ఇదివకీళ్ళు వాదించుస్థలముగాదు. సాక్షులనుభయపెట్టి వంచించుస్థలముగాదు. సూర్యచంద్రులను, అష్టదిక్పాలకులను, తుదకులోకనాథుడగు శ్రీమహావిష్ణువును సయితము జయింపచాలితిమని మదముచే విర్రవీగుచుండు హిరణ్యకశిపు, రావణాది అసురశ్రేష్ఠులకైనను గర్వమునడంచి భయమును పుట్టించుస్థలము. మృత్యుదేవతయధీనముసుమా ఈస్థలమిప్పుడు. ఇందుమృత్యుంజయుడొక్కడుమాత్రము తలయెత్తి తిరుగుటకు అర్హుడుగాని నీయట్టివాడు తలవంచి దైన్యముతో గద్గదస్వరముతో మాటలాడవలెను. హెచ్చరిక. నన్నా నీవు పిలిచినది.

భీమ:— నిన్నే ........

లీల:— నేనచేతనపదార్థముగాదు. నాతలితండ్రులు నాకు పేరిడినారు. నీకునన్ను పెండ్లిచేసియిచ్చినను నాశరీరమును చెడుపుటకు సహాయముచేసిరిగాని నాపేరుమాపుటకుగాదు. నీకధికారము లేదు.

భీమ:— (చెవులుమూసికొని.) నారాయణ! నారాయణ!!

విద్యా:— కృష్ణా! వాసుదేవా!! జ్ఞానముండవలె, జ్ఞానము.

భీమ:— అయ్యయ్యో! దేశమెంత చెడిపోయెను! ధర్మమునకెట్టి దుస్థితిగలిగెను! ఈభారతవర్షమునకెట్టికుందకముగలిగెను! ఎట్టి యపకీర్తిగలిగెను హిందూస్త్రీలకు!

విద్యా:— కలియుగము ముదురుచువచ్చె. సావిత్రి, చంద్రమతి ఇట్టిపతివ్రతాశిరోమణులు సంచరించిన ఈపుణ్యభూమి.......

లీల:— ఆచార్యులవారూ! మారీచి, సుబాహు, శకుని, ఇట్టిపుణ్యజనులవతరించిన ఈపుణ్యభూమి......

విద్యా:— అమ్మా! బుద్ధివచ్చెను. నీతోఎవరు మాట్లాడువారు? ఆమని సాహసించెనా మగవారు, మేమేమిచేయుదుము. ముఖ్యము కలియుగము.

లీల:— ఆచార్యులవారూ! మీయట్టి వారలుండిన నిక్కముగ నియ్యది కలియుగమే. చూడండి. అదియొక్కటేగాదు. ఇది రోకలియుగము. దేవునికైన దెబ్బేగురువు.

భీమ:— మూయుముమునోరు! అధికప్రసంగివి. భర్తయధికారము నీకు దెలియునా? (అనిమాట్లాడుచుండగా)

(మధురపిళ్లె ఒకవైపునుంచివచ్చును. వెంట మరియొకజవానువచ్చును. విద్యాలంకారాచార్యులు, భీమసేనరావు, ఒక్కచోటచేరుదురు. లీలావతి, తార, ఆశ్చర్యమునభినయింతురు.)

శ్రీధర:— (దిగ్గునలేచి) అయ్యా! మీరేలవచ్చితిరిందు?

మధుర:— డూటిపుండాదిసామీ! ఏమిదాచేసేది సెప్పండీ. నౌకరీ చెడ్డది.

శ్రీధర:— అయ్యో! ఏమీ? నీమాటలునాకర్థముగాలేదు.

మధుర:— ఇనస్పెక్టరుగారు మిమ్ములను స్టేషనుకిట్టె పుడుచుకొని రమ్మన్నారు. నీఇల్లుదా సోదాచేయవలె.

శ్రీధర:— ఎందులకు?

మధుర:— ఏమిసామి? కొంచెముగూడ తెలియనట్లుమాట్లాడుతారే! శెట్టిగారింట్లో చంద్రహారము ఎక్కడపెట్టినారోచెప్పండి?

శ్రీధర:—హర! హర!! హర!!! మృత్యుదేవతా! అవమానదేవతను గూడా వెంటబెట్టుకొనివచ్చియున్నావా? (అనిఇంచుకయోచించి) అయ్యా! సోదాచేయుటకు నాయటంకమేమియునులేదు, అయిన నిదిసమయమా?

మధుర:— మేముఏమిదాచేసేది స్వామి? డ్యూటీ డ్యూటీదా. మాఇంటి ఆండవాండ్లు కాయిలాగవుండారుఅంటె లీవుయిచ్చే లేదుఅంటాడుసూపెర్నింటు. డ్యూటీకిఎక్కడస్వామిదయ?

శ్రీధర:— (నవ్వి) నిక్కముగవచించితిరిపిళ్ళైగారూ. ఇప్పటిరాజ్యము ఆచార్యులవారిస్వరాజ్యము. నీయాచార్యులవారి ధర్మము నకుభక్తి లేదు. మీడ్యూటీకిదయలేదు. కానిండు, మీకార్యము కానిండు.

(అప్పుడు భీమసేనరావు హెడ్ కానిస్టేబిల్ కు లీలావతిని, తారను, చూపించి సైగచేయును.)

మధుర:— అమ్మాళ్లెంచెముపోదురు. మీరుబయటదావుండవలె. మారూల్సుకు యిరుద్ధము. ఇంటియజమాని పంచాయితీ వాళ్ళు తప్పవేరెవ్వరువుండరాదని రూల్సు.

లీల:— ఆచార్యులవారేలనుండవచ్చు?

మధుర:— వారుదాపంచాయతీ!

లీల:— సరి! ఇప్పుడుసరిపోయినది. పోలీసుదర్బారు. ఆచార్యులవారి రాజ్యము; వైభవమునకేమితక్కువలేదు.

శ్రీధర:—తల్లీ, లీలావతిదేవీ! బిడ్డా, తారా! మనకేలయధికారులతో వాగ్వాదము. మీరుదయచేసి ఆవలికిపొండు.

(తార, లీలావతియు, వెడలిపోవుదురు.

ఆచార్యులవారు తలపజుట్టిన శాలువయందు కట్టినబంగారుపుస్తకను కుండలో వేయును. హెడ్ కానిస్టేబిల్ వెదకిదానినితీసికొనును. శ్రీధరునిచేతికిసంకెలలు వేయుదురు.)

శ్రీధర:— రామచంద్రా! ఇదియేనానీధర్మపరిపాలనము? ఇదియే నా నీమహిమ? నీకుకన్నులున్నవా? లేవా? కానిమ్ము.

యవనికపడును.

---

# సరిపడని సంగతులు

## మూడవయంకము-మొదటిరంగము.

(కోర్టుహాలు:— అస్థానమేర్పరచబడియుండును. స్టేజుముందర ఎడమభాగమున న్యాయాధిపతిస్థానము. అస్థానమునకు ఎడమప్రక్కన స్టేజుముందరిభాగమున సాక్షులునిలుచుస్థలము నేర్పరచబడియుండును. ఈస్థలమునకెదురుగ స్టేజుముందరిభాగమువ, కుడివైపున అపరాధినిలుచుస్థలము. న్యాయాధిపతిస్థానమునకు మధ్యభాగమున జనులవైపు ముఖముచేసికూర్చొనులాగున ఒకబల్ల, కొన్ని కుర్చీలుఉండును. దీనికి వెనుకప్రక్క స్టేజువెనుకభాగమున కొన్ని బెంచీలుండును. సమయము-మధ్యాహ్నం మూడుగంటలు, అనగా మ్యాజస్ట్రేటు ఫలహారమును ముగించివచ్చుసమయము.)

(ప్రవేశము—కోర్టుగుమాస్తా, రాజుఅయ్యంగారు, తనమేజాపైని డిపాజిషన్సు (కైఫీతుల) కుట్టుచుండును)

(ప్రోసెస్సు సర్వరు సుభానుసింగు దస్కత్తుఅయిన కాగితములు మేజస్ట్రేటువారి రూములోనుండితీసికొనివచ్చి గుమాస్తాకిచ్చును.)

రాజు-అ:— దొరగారి టిఫిన్ ముగిసినదా?

సుభాన్:— ముగిసినది స్వామి! ఏమో చాలయోచనలో వున్నట్లున్నారు.

రాజు-అ:— ఏమిలేదు. ఈకేసువిషయమే!

సుభాన్:— అన్యాయము స్వామీ! ఇరువదియేండ్లుగా మనకందరికి శ్రీధరశాస్త్రులు తెలుసునే. ఆయన దొంగతనము చేస్తాడంటే యేమిస్వామి?

రాజు-అ:— ఆ దొరగారికీ అదే ఆలోచనే! దీనియందేమో మోసమున్నదని అనుమానం పడుచున్నాడు.

సుభాన్:— ఇదివఱకేమైనది స్వామీ?

రాజు-అ:— ముగ్గురు సాక్షులను విచారించినారు. వారిలో ముఖ్యము వీరణ్ణశెట్టిగారు. శాస్త్రిగారింట్లో దొరకిన బంగారిపదకము తమ చోరీమాలులోనిదేయని గట్టిగా చెప్పియున్నాడు.

సుభాన్:— ఇదంత పోలీసువారి పిత్తలాటకమండి. నేను నమ్మను. జేబులోపెట్టుకొనిపోయి ఇంట్లో పడేసింటే పడేసింటారు స్వామీ!

రాజు-అ:__ ముఖ్యమయిన పంచాయితీ సాక్ష్యమున్నదయ్యా-ఇంట్లో దొరకినట్లు.

సుభా:__ ఎవరాపంచాయితీ పెద్దమనిషి?

రాజు-అ:— ఆచార్యులవారయ్యా, విద్యాలంకారాచార్యులు.

సుభా:__ వంకాయాచార్లా? ఊఁ! తెలుసునుస్వామీ. వంకాయలంటే బహుయిష్టము వారికి. అయితే కష్టమేవున్నదిస్వామీ శ్రీధరశాస్త్రికి. ఏమో భగవంతుడున్నాడు. స్వామి ఎవరండీ ఆడోళ్ళువచ్చి కూర్చుంటారు కేసుజరిగేటప్పుడు?

రాజు-అ:__ భీమసేనరావుగారి భార్య, వారిమేనకోడలు.

సుభా:__ (రహస్యముగా) ఏమిస్వామీ! ఆపిల్లముండ మోపి గర్భమయినదా?

రాజు-అ:__ నీకెందుకోయి ఆపోదే? కాకితాలుపడవేసి వెళ్ళిపోవోయి.

(ఇంతలోపల కోర్టుదఫేదార్ ప్రవేశించి ''కచ్చేరితయార్'' అని అరచును. ఒకవైపునుండి న్యాయాధిపతియు, మరియొకవైపునుండి, ప్రాసిక్యూటింగు ఇన్స్పెక్టరు, కానిస్టేబిల్, వకీలు భీమసేనరావు, వీరివెనుక, లీలావతి, తార, పిదప అపరాధ శ్రీధరశాస్త్రి, అందరువచ్చి తమతమస్థానములయందు, కొందరునిలుతురు, కొందరుకూర్చుందురు).

ప్రా-ఇ:__ (లేచి) విద్యాలంకారాచార్లుగారు (అనును)

(వారిపేరు మూడుతూర్లుబిలువబడును. ఆచార్యులవారు చేతికర్రతోడప్రవేశింతురు)

రాజు-అ:__ కట్టతీసి బయటపెట్టండి. బోనుఎక్కండి.

(వారిచేతికర్రను భీమసేనరావు లేచిపుచ్చుకొందురు. ఆచార్యులవారు సాక్ష్యస్థానములోనికి ప్రవేశించి తిన్నగాపాడుముపీల్చుటను ప్రారంభింతురు. ప్రాసిక్యూటింగు ఇన్స్పెక్టరు నస్యము వేయరాదని సైగచేయుదురు. ఆచార్యులవారు తొందరగా డబ్బీనినడుముచేర్చుదురు. పిదప ఆచార్యులవారిని ప్రమాణము చేయింతురు)

ప్రా-ఇ:— (లేచి) ఆచార్యులవారూ! ఈఅపరాధిని మీరు తెలుసునా?

విద్యా:__ ఓహో! నాకు బాగుగతెలియును.

పాి-ఇ౯:— మీరు నౌకరీ ఎక్కడచేయుచుండిరి?

విద్యా:— హాలీ ఈ నేరము జరిగినప్పుడు రాజా వీరణ్ణశెట్టిగారివద్ద గుమాస్తాగయుండిరి. అంతకుముందు మన రావుబహదూరు వకీలు భీమసేనరావుగారివద్ద నౌకరీచేయుచుండిరి. మంచివారే అయితే ఏదో కొంచెము చెయ్యిగుణము భద్రములేదని......

న్యాయాధి:— షట్ అప్. ఆచార్లుగారూ! ఖైదీగుణవర్ణన మీరు చేయునవసరములేదు.

విద్యా:— ఆజ్ఞ, మహాస్వామి! నిజమే ఒక్కరి గుణవర్ణన మనకెందుకు "యేనకేనాప్యవాయేనప్రసిద్ధపురుషోభవ" జ్ఞానము కావలెనండీ, జ్ఞానము.

న్యాయాధి:— జ్ఞానముకంటె ముందుగ మీకు మౌనముగావలె ఇచ్చట. అడిగినప్రశ్నకు బదులుచెప్పుడు.

పాి-ఇ౯:— మీరు మొన్న పదునాలుగవ తేదీ శనివారమునాడు ఉదయము వారియింటికి పోయియుంటిరా?

విద్యా:— ఇట్లనే, పోవలసివచ్చెను. మామూలుగా పోవడములేదండీ.

న్యాయా:— ఎందుకో? వారు బ్రాహ్మణులేగదా?

విద్యా:— నేనుకొంచెము......ఆచారము, మడుగు, మైల, ఉంటుందికదా! పూజ, పురస్కారము, లేనియింటికిపోవడము కొంచెము కష్టముగానే యుంటుందండీ!

"హరిచింతింపకమత్తుడై ......"

దఫేదారు:— సద్దు, సద్దు.

న్యాయా:— ఆచార్లుగారూ! ఇది పురాణస్థలముగాదు. ఆశనివారమునాడు మీరు వారింటికి ఏందులకుపోతిరి?

విద్యా:— తల్లి ముసలిది. చనిపోయియుండెను, ఆ ఖైదు ప్రాయశ్చిత్తమయినను చేయించి కొంచెము ఆత్మశుద్ధికలిగింపవలెనని. బ్రాహ్మణ్యములో కర్మలేకశవమును సాగించుటదురాచారము.

న్యాయా:— మిమ్ముల నెవరైనను పిలిపించియుండిరా?

విద్యా:— లేదు మహాస్వామి! నేనే సహాయముచేయవలయునని పోయియుంటిని. నేను ఒక్కరు పిలువనంపిన పోవువాడనుగాను. నావిషయము తమకంత పరిచయములేదు, తమ తండ్రిగారు మహారాజరాజేశ్రీ గోవిందనాయుడుగారు, వారికి నాయందు మిక్కిలి విశ్వాసము. వారి బ్రాహ్మణభక్తి, సదాచారము, దైవభక్తి ఆహాహా......

న్యాయా:—ఆచార్యులవారూ! కొంచెముఆగండి. మీరు, అడిగిన ప్రశ్నకు జవాబుచెప్పిన జాలును.

విద్యా:— కానిండు మహాస్వామి! తాము ధర్మప్రభువులు, తమ కీర్తి, తమయశస్సు. "దూరాదాకర్ణ్య......"

న్యాయా:— ఆచార్లువారూ! మీకేమి మంచిమాటలతో అవసర మున్నట్లు కనబడదు. ఎక్కువమాట్లాడితే మరితొందరగలుగు ను చూడండి.

విద్యా:— తెలుసును మహాస్వామి! సర్కారు హుకుమేమి తక్కు వైనదా? నేను మీదాసానుదాసుడను.

ప్రా-ఇ:— చెప్పండి ఆచార్లువారూ! ఆశనివారము ఏమిజరిగెను?

విద్యా:— నావెంబడి భీమసేనరావుకూడ వచ్చియుండిరి. ఇంటికి పోవుచుండగా మార్గములో కొంచెము పొద్దుమునించుకొని ఇంటికివెళ్ళి ప్రాయశ్చిత్తపు విషయమునెంతో యుపదేశించి తిని. వీరు (అని అపరాధినిచూపుచు) బ్రాహ్మణులు లేకనే పని ముగించుటకు పూనికొనియుండిరి. అది అధర్మమని చెప్పితిని. ఏదో యథాశక్తి దక్షిణలులేకనే బ్రాహ్మణకర్మలు జరుగు నా? దానికి వీరితిరస్కారము. అందుకేచూడండీ! బ్రాహ్మణ్య ము పాడైపోయింది. దేశములో క్షామముగలుగుచున్నది. మీ తండ్రిగారికాలము ఈకాలము......

న్యాయా:— ఆచార్లువారూ! ఇదిగో రెండవసారి హెచ్చరిక ఇ చ్చుచున్నాను. మరొక్కసారి మీరిట్లనే వాగితిరా, చూడండి తపోగ్రహము లభించును.

విద్యా:—తప్పాయెను, మహాస్వామి! క్షమించవలెను.

ప్రాడ్వి:— ముందేమిజరిగెను?

విద్యా:— హెడ్ కానిస్టేబిల్ మధురపిళ్ళెగారువచ్చిరి. వెంబడి కానిస్టేబిల్ గారువచ్చిరి. నేను సత్యంగా చెప్పుతానండి. ఇది ధర్మస్థానము-న్యాయస్థానము. తాము కేవలము ధర్మావతారము...

న్యాయా:— మూడవహెచ్చరిక సమయము సమీపించియున్నది.

విద్యా:— అయ్యయ్యో! మాటలకుకూడ నిర్బంధమైనచో బ్రాహ్మణులగతి ఏమి? (అని గొణుగుచు) లేదుమహాస్వామి! ఒక్క క్షణములో చెప్పుతాను అంతయు. మధురపిళ్ళెగారు బలవంతముచేసి నన్ను పంచాయతీదారుగా నియమించిరి. ఇల్లంతయు వెదకిరి. మూలకు మూడుకుండలు పేర్చిపెట్టియుండిరి. మేమా కుండలదగ్గరకు పోయినప్పుడు శాస్త్రులవారు కొంచెము ఆక్షేపించిరి. (అనిదగ్గును.) అయితే సర్కారుకార్యము చూడండి, పై రెండుకుండలు తీసినతరువాత క్రిందికుండలో ఒక్కబంగారు పదకము దొరికినదండి. మధురపిళ్ళెగారు దానిని స్వాధీనంచేసుకొనిరి......

ప్రాడ్వి:— ఇదియేనా ఆపదకము!

విద్యా:— అవునుస్వామి! అదేవీరణ్ణశెట్టిగారిది.

న్యాయా:— ఇది శెట్టిగారి పదకము అని మీకెట్లు తెలియును? అది ముందేమైనను చూచియుంటిరా?

విద్యా:— లేదుమహాస్వామి. నేనిదివరకు దానిని చూచియేయుండలేదు.

న్యాయా:— అయితే మీకెట్లు తెలిసినది?

విద్యా:— చెప్పిరిస్వామి అక్కడ.

న్యాయా:— ఎవరుచెప్పిరి? భీమసేనరావుగారుచెప్పిరా? లేక హెడ్డుకానిస్టేబిల్ వారు చెప్పిరా?

విద్యా:— ఎవరుచెప్పలేదుస్వామి. కొంచెము పొరపాటైనది.

న్యాయా:— పొరపాటా?

విద్యా:— అవునండీ "ప్రమాదో౽ధీమతామపి" (అన్నాడు)

న్యాయ:— మరిచెప్పండి. మీకెట్లు తెలిసినది వీరణ్ణశెట్టిగారి పదకమని?

విద్యా: — (ఇటునటుచూచుచు) దానిపైన వెనుకభాగమున 'V' అను అక్షరము వ్రాయబడియున్నదండి.

న్యాయ:— (ఆపదకము తీసిచూచి) ఆచార్యులవారూ! మీకు ఇంగ్లీషు చదువను తెలియునా?

విద్యా:— అయ్యయ్యో! వైదికబ్రాహ్మణుండనే. మీతండ్రిగారికి నాపైన ఎంతభక్తి, విశ్వాసము.

న్యాయ:— ఆచార్యులవారూ! నాకుకూడ మీపైన భక్తి విశ్వాసము పుట్టుచున్నది. చెప్పండి. ఈఇంగ్లీషు అక్షరములనెట్లు జదివితిరి?

విద్యా:— హెడ్డుకానిస్టేబిల్‌గారు జదివిచెప్పిరండీ. పోలీసువారికేమిపట్టిందండీ తప్పుకేసు పెట్టడానికి? ఈకేసు నిజమండీ.

న్యాయ:— నాకును అట్లేతోచుచున్నదండీ. ఆ. ముందుచెప్పండి.

విద్యా:— ధర్మప్రభువులు! జ్ఞానమండి-జ్ఞానము. పంచనామా జరిగినది. శెట్టిగారిని పిలిపించిరి, వారీపదకము తమదేయని గుర్తుపట్టిరి. పిదప శ్రీధరశాస్త్రిని దస్తుగీరుచేసిరి. అయితే ఒక్కమాట-ఎంతచెడిన బ్రాహ్మణుడండీ!

ప్రా-ఇ:— ఇదేనా పంచనామా?

విద్యా:—(చూచి) అవునండి నేను రుజువుచేసినాను.

న్యాయ:— (పంచనామాతీసుకొని చదివి) ఏమండీ ఆచార్లువారూ! దీనిలో ఈపదకం పైకుండలో దొరకినట్లు వ్రాసినదే?

విద్యా:— నేనెక్కడైనను అబద్ధం చెప్పతానండీ? పోలీసువారి పొరపాటుగా వుండవచ్చునండీ.

న్యాయ:— (ప్రాసిక్యూటింగు ఇన్‌స్పెక్టరు కూర్చున్నతరువాత శ్రీధరునివంకచూచి) మీరేమైన అడిగెదరా?

శ్రీధర:__ ఆచార్లవారూ! మీరు శవసంస్కారకార్యమున నాకు సహాయముచేయుటకు వచ్చియుంటిరా?

విద్యా:__ ప్రమాణముగ.

శ్రీధర;__ అయిన శవమును మోయుటకై ద్రవ్యముగావలెనా?

విద్యా:__ అందు తప్పేమి? అదిప్రకృతసంప్రదాయము. దేశాచారము.

శ్రీధరు;__ మీఆచారమునకు దయాదాక్షిణ్యములేదా?

న్యాయా:__ ఈచర్చ అసంగతము.

శ్రీధర:__ క్షమించండి..... ఆచార్యులవారూ! మీరు కుండల దగ్గరకుపోయినప్పుడు నేను నిజముగా ఆక్షేపించితినా? ప్రమాణపూర్వకముగ చెప్పండి.

విద్యా:__ (కోపముతో) నేను ప్రమాణముచేస్తానా? నేనుమీవలె జాతిభ్రష్టుడనుకొంటిరా? మీవలె సంధ్యావందనము విడిచితి ననుకొంటిరా? ఈమాననష్టమును శ్రీమ్యాజస్ట్రేటువారు గమనించవలె. మీతండ్రిగారికి నాపైన ఎంతోభక్తి.

న్యాయా:— (వారించి) కోపపడకండి, ఆచార్యులవారూ! వారుఅడుగవలసినమాట అడిగినారు. పోనిండు. ఈపంచాయతీనామాలో ఆపరాధి, సోదాకాలమందు అటంకముచేసినట్లు మాటయే లేదే?

విద్యా:__ పోలీసువారు మరచిపోయియుండవలెనండి. పాపము పెద్దరికార్డు వ్రాయునప్పుడు ఎంతయని జ్ఞాపకము పెట్టుకొంటారు?

న్యాయా:__ ఆచార్యులవారూ! అంతాకలసి మీరెంత కాలమాయింటిలో నుంటిరి?

విద్యా:__ ఏదీ, కొంచెముసేపేనండీ. ఉన్నంతసేపు భీమసేనరావు ప్రక్కననేయుంటిని. ఆకుండల సమీపమునకు పోనేలేదు.

న్యాయా:__ (నవ్వుచు) ఓహో! ఆచార్యులవారూ! క్రొత్తసంగతులు చెప్పుచున్నారే? అట్లనా? మీకు శెట్టిగారింటి చోరీవిషయము మొదట యెప్పుడు తెలిసినది?

విద్యా:— శెట్టిగారి కుమారుడువచ్చి......(అనుచుండగా భీమసే నరావుగారు దగ్గుదురు. ఆచార్యులవారు ఊరకనిలుతురు.)

న్యాయా:— శెట్టిగారి కొమారుడు ఈచోరీసంగతిచెప్పెనా?

విద్యా:— లేదండీ, లేదు. ఆపిల్లవాడు కొంచెము కన్యకాపరమేశ్వరీదేవాలయపు విషయము మాట్లాడుటకువచ్చియుండెను.

న్యాయా:— (నవ్వుచు) అట్లనా! తొందరపడకండి ఆచార్లవారూ! అపరాధిఇంటికి పోవుటకుముందే, వారిఇల్లు సోదాచేయబడు నను సమాచారము మీకు తెలిసియుండెనా, లేదా?

విద్యా:— లేదుస్వామి, లేదు.

న్యాయా:— మీరేమైనను అపరాధిఇల్లు సోదాచేయవలెనని హెడ్డుకానిస్టేబిలుగారికి ముందుగానే చెప్పియుంటిరా?

విద్యా:— హెడ్డుకానిస్టేబిలుగారు డైరీలో ఏమయిన వ్రాసినారా ఈసమాచారము?

న్యాయా:— ఏదోకొంచెము వ్రాసియున్నది. దానిసమాచారము మీకెందుకండి. మీకును హెడ్డుకానిస్టేబిలుకును జరిగిన సమాచారమును చెప్పండి.

విద్యా:— మధురపిళ్ళెగారికి ఆంధ్రభాషయందంత పరిచయములేదండీ. వ్యాకరణయుక్తముగా నేనాడినమాటలు వారికర్థమాయెనోలేదో. వారు ఏమివ్రాసినారోగాని నేను చెప్పినదంతే. "శ్రీధరుడు బీదవాడు, దారిద్ర్యము, కష్టము, తాపత్రయములు హెచ్చు, ఏదోఆశ, పాపము బ్రాహ్మణుడు, ఎక్కువ తీక్షణము వలదు" అని ఇంతమాత్రము చెప్పితినండి.

న్యాయా:— హెడ్డుకానిస్టేబిలు ఏమిబదులుచెప్పెను.

విద్యా:— ఏమిలేదు. ఇన్స్పెక్టరుగారు శ్రీధరునిఇల్లు సోదాచేయమంటారు అనికొంచెము సూచనచేసిరి.

న్యాయా:— అయితే అపరాధిఇల్లు సోదాచేయబడునని వారిఇంటికి మీరుపోవుటకుముందే తెలిసియుండెనుగదా? సత్యంచెప్పండి.

విద్యా:— మహాస్వామి! సత్యమాడుమని నన్నడుగవలెనా? "సత్యంవద, ధర్మంచర" అన్నాడుస్వామి! వేదపురుషుడు.

న్యాయా:— ఏమీ? సత్యంవదనా?

విద్యా:— అయ్యో! అట్లుగాదుస్వామీ! మాతాతగారు హరిశ్చంద్రనాటకముగా సంస్కృతములోని చండకౌశికమును ఆంధ్రీకరించినారు. తండ్రిగారన్ననో, పంచ-ఐదు-మహాయజ్ఞములుచేసినారుస్వామి! గొప్పవారుస్వామి! భీష్మపంచకము-ఐదుదినములు ఉపవాసము - గంగాపానములేక చేసినారుస్వామి! ఇంకనా సమాచారము నేను చెప్పకొనవలసినదిలేదు మాస్వాములవారు నాకు 'సత్యప్రియ' యనుబిరుదునిచ్చినసంగతి మీకు తెలిసియే యుండవచ్చును. ఇదేవారిశ్రీముఖము, తీసికొనివచ్చియున్నాను. (అని చంకలోనికట్టవిచ్చును.)

న్యాయా:— ఆచార్యులవారు! అక్కరలేదు. తొందరపడవద్దండి. మీసాక్ష్యము, ముగిసినది. చదివిచెప్పుతారువినండి.

విద్యా:— సెలవండి! మీతండ్రిగారికి నాపైనమిక్కిలి విశ్వాసము. మీరిట్టిధర్మప్రభువులు. "సకలైశ్వర్యాభివృద్ధిరస్తు" (అనుచు క్రిందికిదిగిపోవును.)

ప్రా-ఇ:— హెడ్డుకానిస్టేబిల్ మధురపిళ్లై.

(అతనిపేరు మూడు మారులు పిలుచునంతనే అతడువచ్చి సాక్షిస్థానమందు నిలువగా ప్రమాణము చేయింపబడును.)

పోయిననెల రవ తారీఖున రాజావీరణ్ణశెట్టిగారు మీకుచేసిన రిపోర్టు ఇదియేనా?

హెడ్ కా:— (రిపోర్టుచూచి) ఇద్దాసార్.

ప్రా.ఇ:— దీనినిగురించిమీరు విచారణజరిపితిరా?

హెడ్ కా:— సబ్ ఇన్స్పెక్టరు లీవుపైనయుండిరి. నేనుదా ఇన్వెస్టిగేషన్ చేసినాను.

ప్రా-ఇ:— మీఇన్వెస్టిగేషనులో అపరాధియగు శ్రీధరశాస్త్రిగారియిల్లు సోదాచేస్తిరా?

హెడ్ కా:— ఆమా. చేసిండార్.

ప్రి-ఇక్:— మీరేఖుద్దుసోదా చేసితిరా?

హెడ్ కా:— ఆమాసార్! పదునాలాం తారీఖుచేసిండార్.

ప్రి-ఇక్:— పంచాయితీదార్లు ఎదురుగానుండిరా?

హెడ్ కా:— ఆజరువుండిరి.

ప్రి-ఇక్:— వారిలో ఏవరైనను సాక్షి గావచ్చినారా?

హెడ్ కా:— విద్యాలంగారి జోస్యర్ అయ్యర్ వచ్చిండారు.

ప్రి-ఇక్:— సోదాలో ఏమైనదొరకినదా?

హెడ్ కా:— ఒర్ పదఘం దొరికింది.

ప్రి-ఇక్:— ఇదేనా?

హెడ్ కా:— ఇద్దాసార్.

ప్రి-ఇక్:— దీనినెవరైనను గుర్తుపట్టినారా?

హెడ్ కా:— శెట్టియారు తందిదా అనిసెప్పిండార్.

ప్రి-ఇక్:— ఏమి గుర్తులు?

హెడ్ కా:— వెనుకప్రక్క 'వి' అని అచ్చరముండాదిసార్.

ప్రి-ఇక్:— పంచనామా వ్రాసినారా?

హెడ్ కా:— అంతా రూల్సుప్రగారం వ్రాసిండాది.

ప్రి-ఇక్:— ఇదేనా పంచనామా?

హెడ్ కా:— ఇదేనండి.

ప్రి-ఇక్:— (కూర్చొనును.)

న్యాయా:— (శ్రీధరునిచూచి) మీరేమైనను అడుగుదురా?

శ్రీధర:— నేనేమైనను మీసోదాకు అటంకముచేసితినా?

హెడ్ కా:— ఒరుగాలంలేదండీ.

శ్రీధర:— అంతేనండి.

న్యాయా:— పిళ్ళే! ఈపదకమెక్కడచిక్కినది?

హెడ్ కా:— ఒరుమూలెకు మూణుకుండలు జోడించియుండింది. అదిలేమొదల్ చట్టిలేదొరికింది.

న్యాయా:— ఆకుండకుమూత ఏమైనయుండెనా?

హెడ్ కా:— ఇల్లై

న్యాయా:— ఆకుండలో ఏమిసామానులుండెను?

హెం-కా:— కొంచెము పాక్కతుండ్లు ఉండినవండి.

న్యాయా:— ఈపదకము, పైననే అందరికి కనుబడునట్లుండెనా?

హే-కా:— క్షియాపకంపో రాదండి.

న్యాయా:— పోనీ, మొదలుమీరేచూచితిరా? లేక మరెవరైనను చూపించిరా?

హె-కా: — మొదలే, అందపాపారు, కైలె, ఎత్తినారు.

న్యాయా:— సరి, ఈపదకమువెనుక "వి" అను అక్షరమున్నదని వీరణ్ణశెట్టిగారు వ్రాయించియుండిరాం?

హె-కా:— ఇల్లెసార్.

న్యాయా:— అపరాధి ఇల్లు సోదాచేయవలెనని మీకు మొట్టమొదట సలహాచెప్పినవారెవరు?

హె-కా:— (కొంచెమాలోచించి) డైరీలో ఇక్షఫర్ మేషక వున్నదండీ.

న్యాయా:— నీవవశ్యముగ చెప్పవలయును. నేనుడయిరీను చూచియున్నాను,

హె-కా:— అందపాపార్ దానండి 'ఇక్షఫర్ మేషక' ఇచ్చింది.

న్యాయా:— సరి, దిగండి. సాక్ష్యముముగిసినది. శ్రీధరశాస్త్రి! ఇప్పుడు నీపైనసాక్ష్యము పలుకబడినది విన్నావు. నీవేమిచెప్పకొంటావు?

శ్రీధర:— స్వామి! నాకీచోరీసమాచారమే తెలియదు. చంద్రహారమునునేను చూడనేలేను. శెట్టిగారిలెఖ్ఖలపుస్తకములు చేత పట్టడమేగాని వారిపెట్టెలజోలికి నేనెప్పుడుపోవడములేదు. ఈపదకము నాఇంటనెవరుపెట్టిరో నాకు తెలియదు. మాతల్లికి 3 రోజులుగ ఎక్కువఖాయిలాగానుండి 13వ తేది రాత్రియే చనిపోయినది తెల్లవారినతరువాత శవసంస్కరణకార్యమునకై చింతించుచుంటిని. చేతకాసైననుఉండలేదు. కాసులులేకశవమును

పో యుటకు ఒక్కరు రాకపోయిరి. శెట్టిగారికైనను అడిగి పైక ము తేవలెనని యోచించుచుండగా వకీలు భీమసేనరావుగారి భార్య మాఇంటికివచ్చిరి. వెంటనే ఆచార్యులవారును వకీలు గారునుకూడవచ్చిరి. వెంటనే పోలీసువారుగూడవచ్చిరి. ఇల్లంత వెదకిరి. మూలకుచేర్చియున్న దొంతికుండలలో పదకముదొరికె నని నాకుచూపించిరి. నాదగాదంటిని. ఇయ్యది నాయింట నెట్లు దొరికెనో సర్వసాక్షియగు భగవంతునికే తెలియును. నాకొక్కటియు దెలియదు.

న్యాయా:— ఇంతేనా?

శ్రీధర:— ఇంతే.

న్యాయా:— (ఆలోచనచేయుచు) శ్రీధరశాస్త్రి, నీకెవరైనను ద్వేషులున్నారా?

శ్రీధర:— లేరు.

న్యాయా:— నిశ్చయముగ జెప్పుము. నిన్ను చెఱుపవలెనని నీపయి పగఎవరికైనను గలదా?

శ్రీధర:— (ఇంచుక యోచించి) నాకు తెలియదు.

న్యాయా:— నీవు వకీలు భీమసేనరావు కొలువును ఎందులకువదలితివి? అందేమయినను తప్పుచేసితివా?

శ్రీధర:— లేదు.

న్యాయా:— వకీలుగారే నిన్ను కొలువునుంచి తప్పించిరా?

శ్రీధర:— అవును.

న్యాయా:— శాస్త్రి! కారణము నేనడిగెదను, కాని నీకిష్టమున్న చెప్పవచ్చును. లేకున్న ఊరకుండవచ్చును.

శ్రీధర:— అయ్యా! కారణముచెప్పుటకు నాకిష్టములేదు.

తార:— (ముందరికివచ్చి) అయ్యా! ఈయపరాధి నాకుతండ్రి సముఁడు. నను బిడ్డవలెపెంచుచున్నాడు. ఇతనితో మాటాడుటకు నాకు కొంచెమవకాశమిండు.

(అప్పుడు భీమసేనరావుగారింటి నౌకరువచ్చి లీలావతిదేవితో ఏమో చెప్పును. ఈమె తటాలున ఆస్థానమునుండి వెడలిపోవును.)

న్యాయా:— (తారనుచూచి) అమ్మా నీవెవ్వరు?

తార:— నేను వకీలు భీమసేనరావుగారి మేనగోడలు.

న్యాయా:— (భీమసేనరావునుచూచి) రావుజీ! ఇదియేమి?

భీమ:— కోర్టువారు క్షమించవలెను. అమృతమునకు సముద్రమున అమృతమువలె, విషముకూడ పుట్టుటయెట్లనో, అట్లనే సత్కులమున కులభ్రష్టులు పుట్టుటగలదు. ఈయమ విధవయై కేశఖండనము లేకుండినందున......

న్యాయా:— That is enough. చాలు. మీగృహకృత్యపు మర్మములు మాకవసరములేదు. (తారనుగూర్చి) అమ్మా! నీవపరాధితో మాట్లాడవచ్చును. సెలవిచ్చియున్నాను.

తార:— (శ్రీధరునివద్దకువచ్చి) ఏల అట్లుఏమియుచెప్పక యూరకయున్నారు?

శ్రీధర:— తార! చెప్పుటవలనమాత్రము ఏన్యాయమునుగలదు?

తార:— అయిన ఈకోర్టులెందుకు?

శ్రీధర:— కోర్టులా? వకీళ్ళబ్రతుకుకొరకు. ధనవంతుల దుర్మార్గముకొరకు. ఇచ్చటచెల్లునది మాటల లాఘవము, మూటలబరువు. ఇచ్చట దుడ్డుగలవారికే న్యాయముగాని, బిదలనడుగువారులేరు.

తార:— ఇంతమంది వకీళ్ళున్నారే, ఒక్కరైనను నీకుసహాయము చేయరా?

శ్రీధర:— తారా! వకీళ్ళకు జేబులో నోట్లుపడిననే నోటిలోమాటలుకదులును.

తార:— అయిన నీగతియేమి?

శ్రీధర:— తారా! నాకు దైవమేగతి. నాకొరకై నేనుదుఃఖపడువాడుగాను. పరమాత్మకు దేవాలయనిర్బంధము. ఆ పరమాత్మభక్తులకు కారాగృహనిర్బంధము. ఇదియే ఈకాలపుధర్మము.

తార:— అయ్యో! నీవు చెప్పకున్న నేను చెప్పివేయుదును. ఉన్న సంగతి బట్టబయలు చేసివేయుదును. నీపగవారిపేరు బహిరంగము చేసెదను.

శ్రీధర:— తార! తార!! నాయానవలదుసుమా! నీవట్లుచేసిన... తారా! నీకు ప్రపంచానుభవము లేదు. అనేకసమయములందు మౌనమే యెక్కువఫలము నొసగును. నీవేమైనను నామాటవినక గుట్టుబయలు పెట్టితివా, నిక్కముగ నేను ఆత్మహత్యచేసికొందును.

తార: (దుఃఖించుచు) అయ్యయ్యో! మీకు శిక్షయగునే. నేనెట్లు ఓర్తును.

శ్రీధర:— బిడ్డా! ఏడ్వకుము. నాకేమియు బాధగలుగదు. జైలునందు బాధ ఏమున్నదమ్మా? జైలుకు బయటజరుగు అధర్మప్రవర్తనము లోపలలేదమ్మ. నీకు తెలియునే! మరియొక్కమాట. ఇప్పుడు మనసమాజములో స్త్రీలను బాధించుచుండు బాధలకంటె, హింసలకంటె, కారాగృహమందు కలుగు బాధలు మిక్కిలి తక్కువ. అమ్మా! ఈఅవివేకపు ప్రకృతఆచారసంప్రదాయములను జైలుకంటె ఆజైలే మేలమ్మా! ఏడ్వకుము. ఏడ్వకుము. నేనెచ్చటనున్నను నీ క్షేమమునకయ్యే పరమేశ్వరుని ప్రార్థించుచుందును. నీఆరోగ్యమును కాపాడుకొనుము. నీవు దుఃఖపడవలసిన సమయముగాదమ్మ, నేనుత్వరలో వచ్చెదను.

తార:— (ఎక్కువగాదుఃఖించుచు) అయ్యో! నానుంచిగదా నీకీసంకటము. పుట్టిననాడే నేనుచచ్చియుండగూడదా?

శ్రీధర:— తారా! నీవట్లనరాదు. నాకొరకు .....నీ......నీ... ఈశ్రీధరునికొరకు సుఖముగ బ్రదికియుండుము. నీవుదుఃఖించిన చూడలేనమ్మ. కోటినరకబాధలుగూడ నాహృదయమును భేదింపజాలవుగాని, నీకంట నీరుపెట్టుటనుమాత్రము తాళజాలను. నీవేడ్వకుము. లీలావతీదేవి నిన్నుగాపాడును. నీయందుండు నిర్దోషిమైనప్రాణికై నీవు దేవుని ప్రార్థించుచుండుము. నీయట్టివారి

నైతే, నేను దేవదేవుని ప్రార్థించుచుందును. ఇంక కాలవిళంబమగుచున్నది. సుఖముగనుండుము.

తార:— అయ్యో! ఈన్యాయస్థానములో న్యాయమే లేదే!

శ్రీధర:— పిచ్చితారా! బయటమాత్రము న్యాయమున్నదా? సమాజమున ప్రకృతము నిజమైనధర్మములేదు. సమాజములోని అంతర్భాగమైన న్యాయస్థానమున నిజమయిన న్యాయములేదు.

న్యాయా:— అమ్మా! తారాదేవి! ఇంకమీసంభాషణ ముగింపుడు. జరుగతగిన కార్యములున్నవి.

తార:— (దుఃఖించుచు తనస్థానమునకుబోవును.)

న్యాయా:— శాస్త్రిగారు! మీపైన ఇండియన్‌పీనల్‌కోడు సెక్షన్ 380 లేక 411 మేరకు చార్జుచేయబడియున్నది. మీరట్టినేరము చేసితిరా?

శ్రీధర:— లేదు.

న్యాయా:— ఫిర్యాదిపరము సాక్షులను మరల సవాలుచేయుటకు మీకు అవకాశము రేపటివరకు గడువిచ్చియున్నాను.

శ్రీధర:— అయ్యా! నాకేగడువునక్కరలేదు. నేనడుగవలసిన ప్రశ్న ఏదియులేదు. నాకు సాక్షులొక్కరునులేరు. నాసాక్షి జగత్సాక్షియే......

(అప్పుడు రాజారావు తొందరగా ప్రవేశించి జేబులోనుంచి చంద్రహారము కట్టితీసి మేజస్ట్రీటుగారి మేజాపైనుంచి)

రాజా:— మేజస్ట్రీటుగారు! అదియే వీరణ్ణశెట్టిగారియింట దొంగలింపబడిన వస్తువు. దీనివిషయము నేను సవిస్తరముగా చెప్పెదను. అయిన నాసాక్షిత్వము మీరుబహిరంగముగాగాక మీగదిలో వినవలెను. యథార్థము చెప్పెదను. శ్రీధరశాస్త్రి నిరపరాధి.

న్యాయా:—భీమసేనరావుగారు! ఇదిఏమి మీకుమామునిది వింతచర్యగానున్నదే?

భీమ:—ప్రభువుగారు మన్నింపవలెను. నాకేమియర్థముకాదు. నాకు కొంతఅవకాశమిచ్చిన నాకుమారునితో మాటలాడి పిదప విన్నవించెదను.

న్యాయ:—(ప్రాసిక్యూటింగు ఇన్స్పెక్టరును తమవద్దకుపిలిచి యేమో రహస్యముగా మాట్లాడి)

ఈనాటికి కోర్టుచాలించియున్నాము. ఈకేసుమరల మరునాటికి వాయిదావేసియున్నాము. శ్రీధరశాస్త్రిని స్వంతజామీను పూచిపైన విడుదలచేసినాను. (అనిలేచిపోవును. అందరులేతురు.)

(యవనికపడును.)

---

# సరిపడని సంగతులు

## మూడవయంకము-రెండవరంగము.

స్థలము - కచ్చేరిముందు - వీథి - సాయంకాలము.

ప్రాసిక్యూటింగు ఇన్స్పెక్టరు, వకీలు భీమసేనరావు, మాట్లాడుచు ప్రవేశింతురు.

ప్రా-ఇ:—భీమసేనరావుగారు! మీరు నాకుస్నేహితులు. నేను ఎల్లప్పుడు మీక్షేమమును కోరువాడనేకాని అన్యుడనుకాను. మీరు ఈవిషయమున యథార్థము పలుకవలయును.

భీమ:— నాకుమారుడు మీతో ఏమిచెప్పెను?

ప్రా-ఇ:—ఉన్న యుదంత మంతయు తెలిపియున్నాడు. మీరు దాచి ప్రయోజనములేదు. చోరీ చంద్రహారము నీమేజాలోనుంచి క్రిందపడియుండగా మీనౌకరు యల్లప్ప దానినితీసి తనకిచ్చెనని చెప్పియున్నాడు. అదియుగాక దీనియందుండినపదకమును ఆచార్యులవారు శ్రీధరశాస్త్రియింట పడవేయించిన సమాచారమును చెప్పియున్నాడు. ఇంకేమిచెప్పవలయును?

భీమ:— అయ్యో! నీకులోకానుభవము ఉండియు ఇది కుట్రయని తెలిసికొనకపోతిరే.

పాశ్రీ-ఇన్:— రావుజీ! మీకుమారుడు మీపై ఏలదోషం ఆరోపించును? మీకుమారుడు మరియొక సమాచారము చెప్పియున్నాడు.

భీమ:__ అదియేమి?

పాశ్రీ-ఇన్:__ తారాబాయి నీఇల్లువిడచినందుకు కారణము తెలిపియున్నాడు. తాను తారాబాయిని బహిరంగముగా వివాహమాడుటకు నిర్ధరించినట్లును చెప్పియున్నాడు!

భీమ:__ అయ్యయ్యో! కులనాశకుడుపుట్టెనే నాకడుపున నేనేమి చేయుదు. వీడుపుట్టిననాడె చచ్చియుండకూడదా?

పాశ్రీ-ఇన్:— అట్లనకుడు. రాజారావు నవయువకులకు భూషణప్రాయము' అట్టివారుండుటచేతనే పురాతన హిందూసంఘశక్తి సంపూర్ణముగా అంతరించలేదని ధైర్యముకలుగుచున్నది.

భీమ:__ ముందుగతియేమి? ప్రమాదము సంభవించెనే. ఇట్టి అవమానముకలిగినపిదప నేను ఎట్లుజీవింపగలను?

పాశ్రీ-ఇన్:__ భయపడకుడు. మీరుచేసినపనితప్పు. మిక్కిలిపెద్దది. అయినను నేను మీకు సహాయముచేసెదను. మీరునానెంబడి కలెక్టరుదొరగారియొద్దకు రావలెను. జరిగినసంగతులు అనగా మీకు "సరిపడని సంగతులు" అన్నియు వారికితెలిచేసి వారిక్షమాపణవేడవలయు. నేను మీకు సహాయముచేసి ఈకేసు వితుడ్రాచేయించెదను.

భీమ:__ (ప్రాసిక్యూటింగు ఇన్స్పెక్టరు చేతులుపట్టుకొని) అయ్యా మీరేనామానము కాపాడినట్లు.

పాశ్రీ-ఇన్:__ రావుజీ! మరియొక్కమాట. ఈసహాయము మీకు నేనుచేసినందులకై మీరు బహిరంగముగా సంపూర్ణమైన ఉత్సాహముతో మీకుమారుని వివాహముచేయవలెను.

భీమ:__ (నిర్విణ్ణుడై యోచించును)

పాత్రి-ఇః:— రండు యోచింపకుడు. ఉదారమానసమువహింపుడు. ఇందువలన మీకుకలుగబోవు పరిభవముతొలగుటయేగాక సంఘసంస్కరణకార్యమున మీకు ఎనలేనికీర్తికలుగును. తప్పులను ఒప్పులుగామార్చుటయే ఉత్తమజీవియొక్క ముఖ్యకర్తవ్యము. (అనిభీమసేనరావును చేయిపట్టి పిలుచుకొనిపోవును.)

(యవనికపడును.)

---

# సరిపడనిసంగతులు.

## మూడవయంకము-మూడవరంగము.

### భీమసేనరావుగారిగృహము-వివాహమంటపము.

నాగస్వరము వాయించుచుందురు. బంధువులు, మిత్రులుకూర్చొని యుందురు.

పురోహితుడు లోనుండి రాజారావును, తారాబాయిని, మంత్రములతో పసుపువస్త్రములతో పిలుచుకొనివచ్చును. అప్పుడు విద్యాలంకారాచార్యులవారు ప్రవేశించి అందరికి అక్షతలొసగి చేతులుమోడ్చి)

విద్యా:— సోదర సోదరీమణులారా!

ఈవధూవరుల ఆశీర్వదించుటకుముందు నావిన్నపమొకటి సావధానముగా వినవలెను.

ప్రపంచములో తెలియకచేయుదోషములుకొన్ని, తెలిసియుచేయు దోషములుకొన్ని. తెలిసియుచేయు దోషములేపాపములని అనిపించుకొనును. అట్టిపాపమునకు ముఖ్యముగా భీతియేకారణము. ఆభీతికి అజ్ఞానమే జన్మస్థానము. అజ్ఞానము దైవభక్తిలేనందున నేకలుగును.

శాస్త్రపాండిత్యమువలన దైవభక్తికలుగదు. స్నాన, సంధ్యాద్యనుష్ఠానములవలన దైవభక్తికలుగదు. జప తపంబులవలనమాత్రమే లాభములేదు. సర్వేశ్వరునకు ప్రీతికలిగించు పనులవల్లనే తప్ప వేరెట్టియుపాయములనైనను దైవభక్తికలుగదు.

పరమేశ్వరుడు పరమదయాళువు. తెలియక చేసిన వారి తప్పులను తప్పక క్షమించును. తప్పులని తెలిసియు మనస్సు త్రిప్పజాలని వారిని గూర్చి మిక్కిలి పశ్చాత్తాపపడును. అయిన తప్పులను నిర్భీతిగా ఒప్పుకొనినవారిని కరుణించి కడతేర్చును.

పరిష్కృత దేశకాలనిమిత్తముల ననుసరించి మన సాంఘికసమస్యల విషయమై నాహారబాట్లను సవరించి, క్షమించి న్యాయమార్గమందును, ప్రేమమార్గమందును, నాకు చక్కని ధైర్యముకలుగజేయుగాక అని పరమేశ్వరుని ప్రార్థించుచు, ఈవధూవరులతోకూడ నేనును మీకు వందనములర్పించుచున్నాను.

(అనుచు వధూవరులతోడ ఆచార్యులవారు సైతము సభకు సాష్టాంగదండప్రణామంబు చేయుదురు.)

(అందరు "శతమానాభవతి" అనిచెప్పుచు ఆశీర్వదింతురు.)

మంగళము.

య వ నికపడును.

సమాప్తము.